

హైహైలెస్సా

ప్రతి వార్త సంచలనం



హైదరాబాద్, విజయవాడ సంపుటి : 01 సంచిక : 263 ఆదివారం 25 అక్టోబర్ 2026 పేజీలు : 8 వెల : 2/-

బుర్కినా ఫాసోలో అందాల పోటీల పై ప్రభుత్వం నిషేధం

దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యత ఇస్తూ ఉత్తర్వులు

మరోవైపు ఉరిశిక్షను పునరుద్ధరించిన సైనిక సర్కార్

ప్రభుత్వ నిర్ణయాలపై హక్కుల సంఘాల ఆందోళన, మిశ్రమ స్పందనలు

2



ఉక్రెయిన్‌లోని ఒలేష్కీ నగరంలో కాల్పుల విరమణకు మెలానియా ట్రంప్ చొరవ

మానవతా సాయం, పౌరుల తరలింపు కోసం ఇరు పక్షాల అంగీకారం

రష్యా, ఉక్రెయిన్ నాయకత్వాలతో నేరుగా చర్చలు జరిపిన మెలానియా

అక్టోబర్ 29 నుంచి తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం అమలు

2



కమీషన్ల కోసం కక్కుర్తిపడి కాళేశ్వరం కట్టారు: మంత్రి ఉత్తమ్ కుమార్



కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై బీఆర్ఎస్ పార్టీ పదేపదే అబద్ధాలు చెబుతోందని నీటి పారుదల శాఖామంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో నీటిపారుదల వ్యవస్థను గత ప్రభుత్వం నాశనం చేసిందని మంత్రి దుయ్యబట్టారు. 'బీఆర్ఎస్ కమీషన్లకు కక్కుర్తి పడి కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణానికి పూనుకుంది. ఉద్దేశపూర్వకంగానే ప్రాణహిత చేవెళ్ల నుంచి మేడిగడ్డకు మార్చారు. ప్రాజెక్ట్ వ్యయాన్ని 37వేల కోట్ల నుంచి లక్షన్నర కోట్లకు పెంచారు. వాళ్ళు కట్టిన ప్రాజెక్ట్ వాళ్ల హయాంలోనే కూలిపోయినా.. ఇంకా సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు. సీతారామ ప్రాజెక్ట్ రీ డిజైన్ పేరిట 2వేల కోట్ల ప్రాజెక్ట్ వ్యయాన్ని 20 వేల కోట్లకు పెంచారు.

2

నా చిన్నతనంలో అన్యాయాలను చూడలేకే నక్సలైట్ అయ్యా



మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని తెలంగాణ మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. స్త్రీల రాజకీయ ఎదుగుదలలో ఎన్నో సమస్యలు ఎదురవుతాయని పేర్కొన్నారు. ఆయా సమస్యలకు భయపడకుండా వాటిని అధిగమించి వనితలు ఉన్నత స్థానాల్లోకి చేరుకోవాలని ఆకాంక్షించారు. - మిగతా2లో

ఎల్‌నినో ప్రభావంతో హైదరాబాద్‌లో తీవ్ర నీటి కొరత



నీటి వృథాను అరికట్టాలని లౌడ్‌స్పీకర్లతో ప్రచారం

రాష్ట్రంలో 27 శాతం తక్కువ వర్షపాతం నమోదు

తాగునీటి సరఫరాకే తొలి ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వం

నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమాలకు అధికారుల ఆదేశం

2

ఆ పరీక్షను వాయిదా వేయాలి.. సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు లేఖ



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు శనివారం బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణ ఇంజినీరింగ్ విద్యార్థుల ఉద్యోగ అవకాశాలను దెబ్బ తీయొద్దని సూచించారు. నవంబర్ 6వ తేదీన జరగనున్న టీజీపీఎస్సీ ఏఈఈ పరీక్షను వెంటనే వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. - మిగతా2లో

సివిల్స్ అభ్యర్థులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు

బీసీ స్టడీ సర్కిల్ విద్యార్థుల స్టైఫండ్ రూ. 7 వేలకి పెంపు

పుస్తకాల ఫండ్ రూ. 5 వేల నుంచి రూ. 10 వేలకు రెట్టింపు



2

ఆరోపణలకు ఆధారాలు చూపాలని రేవంత్ రెడ్డికి బీజేపీ సవాల్



ఓట్ల తొలగింపు పేదలకు వ్యతిరేకంగా బీజేపీ పన్నిన కుట్ర అని సీఎం ఆరోపణ

'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' పేరుతో పాదయాత్రలకు సిద్ధమైన బీజేపీ

నవంబర్ 1 నుంచి హైదరాబాద్, సిద్దిపేట, కరీంనగర్‌లో బీజేపీ యాత్రలు

2

కమీషన్ల కోసం కక్కుర్తిపడి కాళేశ్వరం కట్టారు: మంత్రి ఉత్తమ్ కుమార్

తెలంగాణలో నీటిపారుదల వ్యవస్థను గత ప్రభుత్వం నాశనం చేసిందని మంత్రి దుయ్యబట్టారు. 'బీఆర్ఎస్ కమీషన్లకు కక్కుర్తి పడి కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణానికి పూనుకుంది. ఉద్దేశపూర్వకంగానే ప్రాణహిత చేవెళ్ల నుంచి మేడిగడ్డకు మార్చారు. ప్రాజెక్ట్ వ్యయాన్ని 37వేల కోట్ల నుంచి లక్షన్నర కోట్లకు పెంచారు. వాళ్ళు కట్టిన ప్రాజెక్ట్ వాళ్ల హయాంలోనే కూలిపోయినా ఇంకా సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు. సీతారామ ప్రాజెక్ట్ రీ డిజైన్ పేరిట 2వేల కోట్ల ప్రాజెక్ట్ వ్యయాన్ని 20 వేల కోట్లకు పెంచారు. అధిక వ్యయంతో నిర్మించినా సరే.. కనీసం ఒక్క ఎకరాకైనా నీళ్లు ఇచ్చారా? జూరాల, దేవాదుల, పాలమూరు రంగారెడ్డి, ఎస్ఎల్బీసీ పూర్తి చేసి ఉంటే ఈ రోజు ఎల్నినో ప్రభావం తెలంగాణపై ఉండేది కాదు. రాష్ట్రంలో నీటి పారుదల వ్యవస్థను కేసీఆర్ అండ్ కంపెనీ సర్వ నాశనం చేసింది. అబద్ధాలు చెబుతూ.. ప్రజలను మోసం చేస్తున్న కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు పేర్ల ముందు జోసెఫ్ గోబెల్స్ అని పెట్టుకుంటే బాగుంటుంది' అంటూ మంత్రి ఉత్తమ్ తీవ్రంగా విమర్శించారు.

ముఖ్యమంత్రి అసమర్థత వల్లే రాష్ట్రంలో కరవు: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

ముఖ్యమంత్రి అసమర్థత వల్లే రాష్ట్ర ప్రజలు తాగు, సాగునీరు కోసం ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, కేపీ వివేకానంద మండిపడ్డారు. 'హైదరాబాద్ నగరంలో తీవ్ర నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. నీరు లేక సతమతమవుతూ ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం రాకముందు హైదరాబాద్‌లో ఇలాంటి పరిస్థితి ఉండేది. ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నాక కేసీఆర్ హయాంలో ట్యాంకర్ల అవసరం లేకుండా నీరు అందించారు. ప్రాజెక్టులు నిర్మించి సాగు, తాగు నీరు అందించిన ఘనత బీఆర్ ఎస్ ప్రభుత్వానికి దక్కుతుంది. కేసీఆర్ హయాంలో లేని నీటి కొరత, కాంగ్రెస్ హయాంలో ఎలా ఏర్పడుతోంది. ముఖ్యమంత్రి అసమర్థత, నీటి పారుదల వ్యవస్థల పై అవగాహణా రాహిత్యం వల్లనే నేడు రాష్ట్రంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు' అని ఎమ్మెల్యేలు విమర్శించారు.

నా చిన్నతనంలో అన్యాయాలను చూడలేకే నక్సలైట్ అయ్యా

స్త్రీల రాజకీయ ఎదుగుదలలో ఎన్నో సమస్యలు ఎదురవుతాయని పేర్కొన్నారు. ఆయా సమస్యలకు భయపడకుండా వాటిని అధిగమించి వనితలు ఉన్నత స్థానాల్లోకి చేరుకోవాలని ఆకాంక్షించారు. శనివారం హైదరాబాద్ మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో.. పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు.. మహిళా రాజకీయ నాయకత్వం సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సెక్రటరీ గురుదీప్ సింగ్ సత్పాల్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కోటా నీలిమ, పెద్దఎత్తున మహిళ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు.

నేను ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నా..

'నా చిన్నతనంలో నేను ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నాను. ఆకలి బాధలు చూశాను.. అయినప్పటికీ అన్ని కష్టాలను ఎదుర్కొని.. నేడు ఈ స్థాయికి చేరుకున్నాను. ములుగు ప్రజల ఆశీర్వాదం, కాంగ్రెస్ పెద్దల అండదండలతో పంచాయతీరాజ్ శాఖకు మంత్రి కాగలిగాను. నాకు ఎలాంటి రాజకీయ బ్యాక్ గ్రౌండ్ లేదు. అపర వనరులు ఉన్న ప్రాంతం ములుగు. అలాంటి ప్రాంతంలో ఒక పేద కుటుంబంలో నేను జన్మించాను. చిన్నతనంలో అన్యాయాలను చూడలేకే నక్సలైట్ అయ్యాను. నేనెప్పుడూ నక్సలైట్ అవుతానని అనుకోలేదు.. కానీ నక్సలైట్ అయ్యాను. ఆ తర్వాత లాయర్, ఎమ్మెల్యే, మంత్రి అవుతానని ఎన్నడూ ఊహించలేదని.. కానీ కష్టాన్ని నమ్ముకొని పనిచేశాను. నేడు మంత్రిగా మీ ముందు ఉన్నాను' అని మంత్రి సీతక్క తెలిపారు.

ప్రజలతోనే ఉండాలనేది నా సిద్ధాంతం...

'నేను మంత్రిగా ఉన్నప్పటికీ ఎప్పుడు నా మూలాలు మరిచిపోలేదు. ప్రజాజీవితమంటే జనంతోనే ఉండాలి. ఇప్పటికీ ప్రతివారం రెండు రోజులు.. నేను ములుగు ప్రజల మధ్యనే ఉంటాను. జనం ఎన్నుకున్నారని.. వారితోనే ఉండాలనేది నా సిద్ధాంతం. ఎమ్మెల్యే, మంత్రి కాగానే ప్రజలతో దూరంగా ఉండాలని.. అప్పుడే గౌరవం ఉంటుందని కొందరు భావిస్తారని.. కానీ నేను ఆ భావనకు పూర్తి విరుద్ధం. మేము ప్రజలకు జవాబుదారులమని.. బాసులం కాదని.. మనం సేవకులం. నాయకులకు ప్రజలే బలం. అయితే మహిళలు ఉన్నతస్థాయికి ఎదిగినా వివక్షతను ఎదుర్కొంటున్నారు. పురుష మంత్రులకు ఇచ్చినంత గౌరవం.. మహిళా మంత్రులకు ఇవ్వరు. అయినప్పటికీ మనం వెనకడుగు వేయాల్సిన అవసరం లేదు. డెడికేషన్, డిటర్మినేషన్‌తో పనిచేస్తూ పోవాలి. నా జీవితం కష్టాల కలపోత, పోరాటాలమయం. నా కష్టాలను. పోరాటాలను ఎప్పటికీ మర్చిపోను' అని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

ఎల్‌నినో ప్రభావంతో హైదరాబాద్‌లో తీవ్ర నీటి కొరత

హైదరాబాద్ నగరాన్ని తీవ్ర నీటి సంక్షోభం ఆందోళనకు గురిచేస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం తగ్గడం, రిజర్వాయర్లలో నీటిమట్టాలు గణనీయంగా పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. తాగునీటి సరఫరాపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుండటంతో, నీటిని పొదుపుగా వాడుకోవాలని నగరంలోని రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు పౌరులకు విజ్ఞప్తి చేస్తున్నాయి. మణికొండలోని పంచవటి సాయి లక్ష్మి కాలనీలో ఒక వ్యక్తి సైకిల్‌పై లౌడ్‌స్పీకర్‌తో అవగాహన కల్పిస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కార్లు, సెల్లార్లు, రోడ్లు, టెర్రస్‌లు శుభ్రం చేసేందుకు కుళాయి లేదా బోర్ నీటిని వృథా చేయవద్దని ఆయన నినదిస్తున్న తీరు, నగరంలో నెలకొన్న నీటి ఎద్దడి తీవ్రతను కళ్లకు కడుతోంది. రాష్ట్రంలో నెలకొన్న ఈ క్లిష్ట పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా అంగీకరించింది. ఈ ఏడాది సాధారణం కంటే 27 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, ఫలితంగా రాష్ట్రంలోని 621 మండలాలకు గాను 324 మండలాల్లో భూగర్భ జలాలు అట్టడుగుకు పడిపోయాయని నివేదికలు వెల్లడిస్తున్నాయి. కొన్ని రిజర్వాయర్లలో నీటి నిల్వలు 20 శాతం కంటే తక్కువకు చేరుకున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా తెలిపారు. ప్రస్తుత తరుణంలో సాగునీటి కంటే ప్రజలు, పశువులు, ఇతర జీవరాశుల తాగునీటి అవసరాలకే ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలోని జలాశయాల్లో 30 నుంచి 40 శాతం మేర నీటి నిల్వలు ఉన్నాయని, 2027 జూలై వరకు తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడటమే తమ ప్రథమ కర్తవ్యమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పులు, నీటి పొదుపు ఆవశ్యకతపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. నీటి సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించేందుకు త్వరలోనే ఒక ప్రత్యేక టోల్-ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

సివిల్స్ అభ్యర్థులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు

సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమవుతున్న బీసీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. హైదరాబాద్‌లోని సైదాబాద్ బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందుతున్న 100 మంది అభ్యర్థులకు అందించే ఆర్థిక సాయాన్ని గణనీయంగా పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. పెంచిన మొత్తాలను వచ్చే నెల నుంచే అమలు చేయనున్నట్లు ప్రకటించింది. వివరాల్లోకి వెళితే, సివిల్స్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు ఇప్పటివరకు నెలకు రూ.5,000గా ఉన్న స్టైఫండ్‌ను రూ.7,000కు పెంచారు. అదేవిధంగా, పుస్తకాల కొనుగోలు కోసం ఒకేసారి ఇచ్చే బుక్ ఫండ్‌ను రూ.5,000 నుంచి ఏకంగా రూ.10,000కు రెట్టింపు చేశారు. ఈ పెంచిన మొత్తాలను విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తెలిపారు. ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం సైదాబాద్ కేంద్రంలో 100 మంది విద్యార్థులకు మూడేళ్ల సమగ్ర సివిల్స్ శిక్షణ అందిస్తున్నామని, మరో 100 మందికి ఇతర పోటీ పరీక్షల కోసం ఫౌండేషన్ కోర్సులలో శిక్షణ ఇస్తున్నామని హరికృష్ణ పేర్కొన్నారు. అభ్యర్థులు ప్రైవేట్ స్టడీ హాళ్ల కోసం డబ్బు వృథా చేయకుండా, స్టడీ సర్కిల్ లైబ్రరీ వేళలను కూడా పొడిగించినట్లు తెలిపారు. ఇకపై లైబ్రరీ ఉదయం 7 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బుర్కినా ఫాసోలో అందాల పోటీల పై ప్రభుత్వం నిషేధం

పశ్చిమాఫ్రికా దేశమైన బుర్కినా ఫాసో సైనిక ప్రభుత్వం సంచలన నిర్ణయాలతో వార్తల్లో నిలిచింది. దేశంలో జరిగే అన్ని రకాల అందాల పోటీలను తక్షణమే నిలిపివేస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. దేశ సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక విలువలకు ఈ పోటీలు విఘాతం కలిగిస్తున్నాయని, వాటికి అనుగుణంగా కొత్త నిబంధనలు రూపొందించే వరకు ఈ నిషేధం కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇకపై ఇలాంటి కార్యక్రమాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వబోమని కూడా తేల్చి చెప్పింది. 2022 సెప్టెంబర్‌లో అధికారం చేపట్టిన కెప్టెన్ ఇబ్రహీం ట్రాయోరే నేతృత్వంలోని సైనిక ప్రభుత్వం.. దేశ భద్రత, సాంస్కృతిక గుర్తింపు పేరిట పలు కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే అందాల పోటీలను నిలిపివేసిన ప్రభుత్వం, మరోవైపు దేశంలో ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు ఉరిశిక్షను కూడా పునరుద్ధరించింది. అక్టోబర్ 20న పార్లమెంట్‌లోని 71 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఈ బిల్లును ఆమోదించారు. ఉగ్రవాదం, దేశద్రోహం, గూఢచర్యం వంటి తీవ్రమైన నేరాలకు మరణశిక్ష విధించేలా కొత్త చట్టాన్ని తీసుకొచ్చారు. 2018లో రద్దు చేసిన మరణశిక్షను తిరిగి ప్రవేశపెట్టడం గమనార్హం. అందాల పోటీలను వద్దన్న ప్రభుత్వం, మరోవైపు యువతుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని ప్రోత్సహించడంపై దృష్టి సారించింది. 'హకిలి మౌసో' పేరుతో జాతీయ స్థాయిలో యువతుల కోసం సైన్స్ పోటీలు నిర్వహించింది. గణితం, భౌతిక, రసాయన శాస్త్రాల్లో ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు, విద్యా ప్రోత్సాహకాలు అందించింది. విజేతలను సైనిక పాలకుడు కెప్టెన్ ఇబ్రహీం ట్రాయోరే స్వయంగా అభినందించి, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో రాణించాలని ప్రోత్సహించారు. ప్రభుత్వ నిర్ణయాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉరిశిక్షను పునరుద్ధరించడాన్ని హ్యూమన్ రైట్స్ వాచ్, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటి అంతర్జాతీయ సంస్థలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దీనిని రాజకీయ ప్రత్యర్థులపై ప్రయోగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశాయి. అదే సమయంలో, అందాల పోటీలపై నిషేధాన్ని కొందరు స్వాగతిస్తూ, యువతుల తెలివితేటలకు ప్రభుత్వం విలువ ఇస్తోందని ప్రశంసిస్తుండగా, మరికొందరు ఇది మహిళల స్వేచ్ఛను హరించడమేనని విమర్శిస్తున్నారు. మొత్తం మీద, సైనిక పాలనలో బుర్కినా ఫాసో తనదైన పంథాలో ముందుకు సాగుతున్నట్లు ఈ నిర్ణయాలు స్పష్టం చేస్తున్నాయి.

ఆ పరీక్షను వాయిదా వేయాలి.. సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు లేఖ

ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణ ఇంజినీరింగ్ విద్యార్థుల ఉద్యోగ అవకాశాలను దెబ్బతీయొద్దని సూచించారు. నవంబర్ 6వ తేదీన జరగనున్న టీజీపీఎస్సీ ఏఈఈ పరీక్షను వెంటనే వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. టీజీపీఎస్సీ ఏఈఈ పరీక్షలు ఒకే తేదీలో ఉండటంతో వేలాది మంది తెలంగాణ ఇంజినీరింగ్ అభ్యర్థులు ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో గ్రూప్ జీజు పరీక్ష రాసే అభ్యర్థులు వెంటనే తెలంగాణకు తిరిగివచ్చి ఏఈఈ పరీక్ష రాయడం ఎలా సాధ్యం? అని ప్రశ్నించారు.

ఆ రెండు పరీక్షలు రాసే అవకాశం కల్పించాలి

ఏళ్ల తరబడి కష్టపడి సిద్ధమైన రెండు పోటీ పరీక్షల్లో నిరుద్యోగ యువత ఒకదాన్ని వదులుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నారని హరీశ్‌రావు చెప్పుకొచ్చారు. పరీక్షల తేదీలు మార్చాలని పలుమార్లు విజ్ఞప్తులు చేసినా టీజీపీఎస్సీ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. పరీక్షల తేదీలను పున: పరిశీలించాలని అక్టోబర్ 14వ తేదీనే టీజీపీఎస్సీకి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లేఖ రాశారని ప్రస్తావించారు. నిరుద్యోగ యువత రెండు పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని కోరారు.

నిరుద్యోగ యువత భవిష్యత్తును బలి చేయొద్దు..

ఒడిశా, బిహార్ వంటి రాష్ట్రాల్లో పరీక్షల తేదీలు మార్చినప్పుడు తెలంగాణలో ఎందుకు సాధ్యం కాదు? అని హరీశ్‌రావు నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్.. భేషజాలకు పోయి నిరుద్యోగ యువత భవిష్యత్తును బలి చేయొద్దని హితవు పలికారు. తక్షణమే జోక్యం చేసుకొని నవంబర్ 6వ తేదీన జరగనున్న టీజీపీఎస్సీ ఏఈఈ (సివిల్) పరీక్షను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఎలాంటి గందరగోళం జరగకుండా ప్రభుత్వం, టీజీపీఎస్సీ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హరీశ్‌రావు సూచించారు.

ఆరోపణలకు ఆధారాలు చూపాలని రేవంత్ రెడ్డికి బీజేపీ సవాల్

తెలంగాణలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. తమ ఓటును తొలగించారని రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక్క ఓటరు కూడా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయలేదని, కానీ కాంగ్రెస్ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో పేదలు, ఆదివాసీలు, దళితులు, మైనారిటీలు, మహిళల ఓట్లను తొలగించి ఎన్నికల్లో గెలవాలని బీజేపీ కుట్ర పన్నుతోందని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించిన విషయం తెలిసిందే. ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో ఓటు హక్కు ఉన్నవారు, లేనివారు అంటూ రెండు రకాల పౌరులను సృష్టిస్తున్నారని, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలోనూ బీజేపీ ఇదే పద్ధతిని అనుసరించిందని ఆయన విమర్శించారు. ఈ ఆరోపణలపై శుక్రవారం రాంచందర్ రావు స్పందిస్తూ, "ఇప్పటివరకు ఒక్క ఓటరు కూడా తన ఓటు పోయిందని చెప్పలేదు. కానీ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి మాత్రమే వీధుల్లోకి వచ్చి ఓట్లు తొలగించారని అరుస్తున్నారు" అని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి, ఆయన మంత్రులు తమ ఆరోపణలకు ఆధారాలు చూపించాలని సవాల్ విసిరారు. ఓట్ల తొలగింపు అంశంపై నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన నిరసనలో ఆ పార్టీ నేతలు పాల్గొంటుండడాన్ని కూడా రాంచందర్ రావు తప్పుబట్టారు. దీనికి ప్రతిగా, 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి – అరాచకానికి వ్యతిరేకంగా పోరాడండి' అనే నినాదంతో బీజేపీ పాదయాత్రలు నిర్వహిస్తుందని ప్రకటించారు. నవంబర్ 1న హైదరాబాద్‌లో ఈ యాత్ర ప్రారంభమై, ఆ తర్వాత సిద్దిపేట, కరీంనగర్‌లో కొనసాగుతుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్, బీజేపీ మధ్య ఓటర్ల జాబితా సవరణ అంశం తీవ్ర రాజకీయ వివాదానికి దారితీసింది. భారీ ఎత్తున ఓట్లు తొలగించారని కాంగ్రెస్ ఆరోపిస్తుండగా, ఇది కేవలం నకిలీ, డూప్లికేట్, మరణించిన ఓటర్లను గుర్తించి తొలగించేందుకు ఎన్నికల సంఘం చేపట్టే సాధారణ ప్రక్రియేనని బీజేపీ వాదిస్తోంది.

ఉక్రెయిన్‌లోని ఒలేష్కీ నగరంలో కాల్పుల విరమణకు మెలానియా ట్రంప్ చొరవ

అమెరికా ప్రథమ మహిళ మెలానియా ట్రంప్ అరుదైన దౌత్య విజయం సాధించారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో కీలకమైన ప్రాంతంలో ఆమె చొరవతో తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. రష్యా అధీనంలో ఉన్న ఉక్రెయిన్‌లోని ఒలేష్కీ నగరంలో మానవతా సాయం అందించేందుకు, పౌరులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఈ ఒప్పందం మార్గం సుగమం చేసింది. ఈ కాల్పుల విరమణ అక్టోబర్ 29 నుంచి అమల్లోకి రానుంది. ఈ ఒప్పందం వివరాలను మెలానియా ట్రంప్ స్వయంగా ఒక ప్రకటనలో వెల్లడించారు. ఒలేష్కీ నగరం 'విపత్తు అంచున' ఉందని, అక్కడి పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలో మిగిలి ఉన్న వారిలో ఎక్కువ మంది వృద్ధులేనని, పరిమిత విద్యుత్ సరఫరా మధ్య ఆహారం, మందులు, మంచి నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమె వివరించారు. ఈ మానవతా సంక్షోభాన్ని నివారించేందుకు తాను రష్యా, ఉక్రెయిన్ దేశాల నాయకత్వాలతో నేరుగా మధ్యవర్తిగా మాట్లాడి ఒప్పందం కుదిర్చినట్లు తెలిపారు. ఈ ఒప్పందం ప్రకారం అక్టోబర్ 29 నుంచి ఒలేష్కీ నగరంలో ఇరుపక్షాలు సైనిక చర్యలను తాత్కాలికంగా నిలిపివేస్తాయి. ఈ సమయంలో నగరంలోకి మానవతా సాయాన్ని అనుమతిస్తారు. ఇరు దేశాలకు చెందిన పౌర నేతలు నగరాన్ని సందర్శించి, అక్కడి వాస్తవ పరిస్థితులను, అవసరాలను అంచనా వేస్తారు. నగరం నుంచి బయటకు వెళ్లాలనుకునే పౌరులకు వారు కోరుకున్న గమ్యస్థానాలకు చేరేందుకు సమన్వయంతో కూడిన సహాయాన్ని అందిస్తారు. ఈ మొత్తం ప్రక్రియను ఒక స్వతంత్ర మీడియా సంస్థ పర్యవేక్షించి, డాక్యుమెంట్ చేయనుంది. ఉక్రెయిన్‌లోని ఖేర్సన్ ప్రాంతంలో, నీపర్ నది దక్షిణ తీరంలో ఒలేష్కీ నగరం ఉంది.

సంపాదకీయం

వివేచన మేల్కొంది.. నిరసన రగుల్కొంది



స్వేచ్ఛ కోల్పోయినా, తగ్గిపోయినా మనిషి మనుగడ వర్ధిల్లుతుందా? అసాధ్యం. ఆహార ఇంధనాలు కొరవడినప్పుడు మనిషి జీవితంలో సుఖ సంతోషాలు కొరవడుతాయి. ఇటువంటి దుర్భర పరిస్థితులలో ఏం చేస్తారు? నిరసన తెలుపుతారు. తిరుగుబాటు చేస్తారు. ఇప్పుడు పలుదేశాలలో ప్రజలు ముఖ్యంగా యువజనులు పెద్దఎత్తున అదే చేస్తున్నారు. ఫ్రాన్స్, అల్బేనియా, బెల్జియం, బ్రెజిల్, చిలీ, ఇటలీ, మొరాకో, పోర్చుగల్.. అన్నట్టు మన భారత్‌లోనూ యువత ఉగ్రతాండవం చేస్తోంది. ఈ పరిస్థితులకు ప్రభుత్వాలదే బాధ్యత అని నిందిస్తున్నారు. సంక్షోభాన్ని ఉపశమింపజేసేందుకు గానీ, అపసవ్య పరిస్థితులను సరిదిద్దేందుకు గానీ ప్రభుత్వాలు చేయవలసినది చేయడం లేదని దేశ దేశాల జనులు భావిస్తున్నారు. కొన్ని యూరోపియన్ దేశాలలో అయితే నిరసనలు హింసాత్మకంగా పరిణమించాయి.ఆహార ధరలు తమ ఆదాయంలో ఎక్కువ భాగాన్ని హరించివేస్తున్నాయని, ఇంధన వ్యయాలు భరించలేని విధంగా ఉన్నాయని అమెరికాలో ప్రజాకోటి అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలే ఇందుకు కారణమని అమెరికన్లు నిందిస్తున్నారు. ఫ్రాన్స్‌లో విద్యార్థులు వీధుల్లో చెలరేగిపోతున్నారు. పాఠశాలల్లో సదుపాయాలు లోపించడం, ఉపాధ్యాయుల కొరతతో విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయన్న ఆందోళనతోనే ఫ్రెంచ్ విద్యార్థి లోకం అట్టుడికిపోతోంది. ఈ పరిస్థితికి కారకుడు అధ్యక్షుడు మేక్రాన్ అన్నదే ప్రతి ఫ్రెంచ్ పౌరుడి మాట. వెలకట్టలేని బంగారు మాగాణాలను అమెరికా పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారు అన్నది అల్బేనియాలో ప్రజాఫిర్యాదు. ప్రధానమంత్రి ఎడి రామ ఇందుకు బాధ్యుడని అల్బేనియన్ల ఆరోపణ. 'ఆహారాన్ని సమకూర్చుకోగలిగినప్పుడే, నాణ్యమైన విద్యను పొందగలిగినప్పుడే, నా పరిసరాల పచ్చదనాన్ని కాపాడుకోగలిగినప్పుడే నేను స్వేచ్ఛాయుత జీవిని' అన్న ప్రజల వివేకశీల వివేచనలో భాగమే ప్రస్తుతం దేశదేశాలను కుదిపేస్తున్న నిరసన పోరాటాలు. గాంధీజీ ఉప్పు సత్యాగ్రహం గుర్తుందా? ఉప్పుపై పన్నుకు వ్యతిరేకంగా ఆయన నిర్వహించిన నిరసన లాంటివే ప్రస్తుత నిరసనోద్యమాలు. నిజమే, ఉప్పుపై పన్ను ఒక వ్యక్తి స్వేచ్ఛను తగ్గించదు. అయితే వలస పాలకులు విధించిన ఉప్పు పన్ను మహాత్మాగాంధీ స్వేచ్ఛా దార్శనికతకు అసంగతమైనది. ఆ పన్ను విధించడంలో వలస పాలకుల ఆలోచనను ఆయన అసహ్యించుకున్నారు, ప్రజలను చైతన్యపరిచారు. సార్వభౌమిక ప్రజాస్వామ్య దేశంలో ఓటు ప్రతి పౌరుడి అమూల్యమైన హక్కు. అది ప్రజాస్వామిక నైతికత. మనది ప్రజాస్వామ్య దేశం. మరి ఓటర్ జాబితాల నుంచి 13,30,00,000 (26 రాష్ట్రాలలోని మొత్తం వయోజనులలో 14శాతం) పేర్లను తొలగిస్తే నిరసన ప్రజ్వరిల్లదని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఎలా విశ్వసించింది? ఈ సర్కారు అంత మందబుద్ధిగలదని నేను నమ్మలేకపోతున్నాను. ఒక 'ప్రక్రియ'ను అనుసరించి ఓటర్ జాబితాల నుంచి ఆ పేర్లను తొలగించినట్టు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) వెల్లడించింది. ఆ 'ఒక ప్రక్రియ' న్యాయవిహిత ప్రక్రియ కాదు. చట్టబద్ధంకాని చర్యకు పాల్పడినట్లు ఈసీఐ అంగీకరించింది. తొలగించిన ఓటర్ల పేర్లను జాబితాలలో తిరిగి చేర్చేందుకు ఎన్నికల సంఘం ఇప్పుడు 'ప్రత్యేక శిబిరాల'ను నిర్వహిస్తోంది. 26 రాష్ట్రాలలో మూడు దశలుగా సర్ ప్రక్రియను అమలుపరిచారు. మొదటి దశలో ఒక రాష్ట్రంలోను, రెండో దశలో 9 రాష్ట్రాలలోను, మూడో దశలో 16 రాష్ట్రాలలోను అమలుపరిచారు. ఆయా రాష్ట్రాలలో వయోజన జనాభా-- మొదటి దశ ఏకైక రాష్ట్రంలో 8.21 కోట్లు, రెండో దశ 9 రాష్ట్రాలలో 51.60 కోట్లు, మూడోదశ 16 రాష్ట్రాలలో 35.50 కోట్లు. ఓటర్ జాబితాల నుంచి తొలగించిన పేర్లు-- మొదటి దశలో 0.65 కోట్లు, రెండో దశలో 6.50 కోట్లు, మూడో దశలో 6.15 కోట్లు. మొత్తం తొలగింపులు (మృతులతో సహా) 13.30 కోట్లు. మొత్తం వయోజన జనాభాలో తొలగింపుల శాతం-- మొదటి దశలో 7.92శాతం, రెండో దశలో 12.6 శాతం, మూడో దశలో 17.18శాతం. మూడు దశలలో తొలగింపుల సగటు 14 శాతం.ఓటర్ జాబితాలను రూపొందించడం వ్యయ ప్రయాసలతో కూడిన పని. ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ అమలుకు ఎన్ని వందల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారు? ఓటర్ల నమోదును మళ్లీ చేపట్టేందుకు చేస్తున్న వ్యయమెంత? ఆ వ్యయభారాన్ని ఎవరిపై మోపుతారు?

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రాహత్ పథకం సద్వినియోగం చేసుకోవాలి

తెహెల్కా న్యూస్ అక్టోబర్ 24 యాదాద్రి భువనగిరి:

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు ప్రమాదం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్‌లో వైద్య చికిత్స అందించి ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రాహత్ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రమాద బాధితులకు చికిత్స ఖర్చుతో సంబంధం లేకుండా సమీపంలోని ఆసుపత్రుల్లో తక్షణ వైద్య సేవలు అందించాలని సూచించారు.రోడ్డు ప్రమాద బాధితుల చికిత్స పథకం-2025 కింద పీఎం రాహత్ పథకం అమలుపై రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి,జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి ఈ సమావేశానికి హాజరయ్యారు.పీఎం రాహత్ పథకం అమలు విధానం, ఆసుపత్రుల్లో బాధితులకు వైద్య సేవలు అందించే ప్రక్రియ, ప్రమాద వివరాల నమోదు, క్లెయిమ్‌ల ఆమోదం, నిధుల విడుదల, తదితర అంశాలను ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితుడికి వైద్య చికిత్స అందించడం అత్యంత కీలకమని తెలిపారు. గోల్డెన్ అవర్‌లో తగిన చికిత్స అందించడం ద్వారా ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. ప్రమాద బాధితులను చికిత్స ఖర్చుల గురించి ఆలోచించకుండా సమీపంలోని ప్రభుత్వ (లేదా) పథకం పరిధిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి అత్యవసర వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు.పీఎం రాహత్ పథకం కింద అర్హులైన రోడ్డు ప్రమాద బాధితులకు ఒక్కొక్కరికి రూ. 1.50 లక్షల వరకు చికిత్స ఖర్చును నిబంధనల ప్రకారం కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ఈ పథకం కింద చికిత్స పొందుతున్న ప్రమాద బాధితుల సంఖ్య తక్కువగా ఉందని, అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పథకం ప్రయోజనాలు అర్హులైన వారందరికీ అందేలా చూడాలని ఆదేశించారు.పీఎం రాహత్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఏటా సుమారు రూ. 100 కోట్ల వరకు ఆరోగ్యశ్రీ నిధులను ఆదా చేసే అవకాశం ఉందని తెలిపారు. ప్రమాద బాధితులకు మొదట పీఎం రాహత్ పథకం





కింద నిర్దేశిత పరిమితి వరకు చికిత్స అందించాలని, ఆ పరిమితి దాటిన తర్వాత కూడా వైద్యపరంగా అవసరమైతే నిబంధనల ప్రకారం ఆరోగ్యశ్రీ పథకాన్ని వినియోగించి బాధితుల ప్రాణాలను కాపాడాలని సూచించారు.పీఎం రాహత్ పథకాన్ని అమలు చేసేందుకు జిల్లాల్లోని అన్ని ఆసుపత్రులు సంబంధిత పోర్టల్‌లో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకవాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులన్నీ పథకం అమలుకు అవసరమైన నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. నమోదైన ఆసుపత్రుల్లో ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, అర్హులైన బాధితులకు పథకం ప్రయోజనాలు అందకుండా ఉండే పరిస్థితులు తలెత్తకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు.ప్రభుత్వ, పథకం పరిధిలోని ప్రైవేట్ ఆసుపత్రులు రోడ్డు ప్రమాద కేసులను నేషనల్ హెల్త్ అథారిటీకి చెందిన టీఎంఎస్ 2.0 పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి ప్రమాదానికి సంబంధించిన వివరాలను ఈ-డీఏఆర్ (eDAR) పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు అవసరమైన ధ్రువీకరణలు, ఆమోదాలను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రమాదం జరిగిన 24 గంటల్లోపు నమోదైన కేసులకు సంబంధించి ఆసుపత్రుల నుంచి వచ్చే ధ్రువీకరణ అభ్యర్థనలను పోలీసు అధికారులు వెంటనే పరిశీలించి ఈ-డీఏఆర్ పోర్టల్‌లో ఆమోదించాలని స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రమాద కేసుల వివరాల నమోదు, ధ్రువీకరణ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని సూచిం చారు. ప్రమాద వివరాల నమోదు (లేదా) పోలీసు ధ్రువీకరణలో జాప్యం కారణంగా బాధితులకు చికిత్స అందడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదని తెలిపారు. ఆసుపత్రులు సమర్పించిన చికిత్స క్లెయిమ్ లను సంబంధిత పోర్టల్‌లో పరిశీలించి ఆమోదించిన అనంతరం, పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (పిఎఫ్ ఎంఎస్) ద్వారా ఆసుపత్రులకు నిధులు విడుదల చేసే ప్రక్రియను సజావుగా నిర్వహించాలని పేర్కొన్నారు. పథకం అమలులో ఎదురయ్యే సమస్య లను పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ నియమించిన ఫిర్యాదుల పరిష్కార అధికారి ద్వారా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ప్రతి జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి మ్యాపింగ్ చేయాలని, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశాల్లో ప్రమాదాల వివరాలు, బాధితులకు అందుతున్న వైద్య సేవలు, పెండింగ్ కేసులు, క్లెయిమ్‌ల ఆమోదం, ఆసుపత్రులకు నిధుల చెల్లింపులపై సమీక్షించాలని సూచించారు. జాతీయ సమాచార కేంద్రం (ఎన్ఐసీ) జిల్లా ఇన్ఫర్మాటిక్స్ అధికారిని జిల్లా రోడ్డు భద్రతా కమిటీలో క్రియాశీల సభ్యుడిగా చేర్చి, ఈ-డీఏఆర్, పీఎం రాహత్ పోర్టల్ల నిర్వహణకు అవసరమైన సాంకేతిక సహకారం పొందాలని తెలిపారు. ఆరోగ్య, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, బాధితులకు చికిత్స పూర్తికాకముందే పథకానికి సంబంధించిన ప్రక్రియల కారణంగా ఆసుపత్రుల నుంచి డిశ్చార్జి చేసే పరిస్థితి రాకుండా చూడాలని స్పష్టం చేశారు. పథకంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు నెక్ట్‌జెన్ ఎం-పరివాహన్ మొబైల్ యాప్ వినియోగాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. ఈ యాప్ ద్వారా రోడ్డు ప్రమాదాల సమాచారం అందించడం, క్లెయిమ్‌ల స్థితిని తెలుసుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ పీఎం రాహత్ పథకం కింద జిల్లాలోని అన్ని ఆసుపత్రులు సంబంధిత పోర్టల్ నమోదు అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లోస్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సాత్విక్,డీఎంహెచ్ఓ మనోహర్, ట్రాఫిక్ డియస్ పి ప్రభాకర్ రెడ్డి,జిల్లా రవాణా అధికారి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఒక్క ఓటరు కూడా ఓటు తొలగించారని ఫిర్యాదు చేయలేదు

-కాంగ్రెస్ ఆరోపణలను ఖండించిన
తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు
-ఓటు చోరీ పేరుతో ప్రజలను తప్పుదోవ
పట్టిస్తున్నారు.. నవంబర్ 1 నుంచి బీజేపీ ర్యాలీలు

తెహెల్కా న్యూస్ (అక్టోబర్ 24) హైదరాబాద్ :

రాష్ట్రంలో ఓటర్ల జాబితా నుంచి ఓట్లు తొలగిస్తున్నారంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు ఖండించారు. ఇప్పటివరకు ఒక్క ఓటరు కూడా తన ఓటు తొలగించారని తమ వద్దకు వచ్చి ఫిర్యాదు చేయలేదని ఆయన స్పష్టం చేశారు. ఓటు చోరీ పేరుతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ద్వారా అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించి ఎన్నికల్లో గెలవాలని ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ కుట్ర చేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర ఎన్నికల్లో ఓట్ల తొలగింపు ద్వారా బీజేపీ లబ్ధి పొందిందని, ఇప్పుడు తెలంగాణలోనూ అదే విధానాన్ని అనుసరించాలని చూస్తోందని ఆయన పేర్కొన్నారు. పేదలు, ఆదివాసీలు, దళితులు, మైనారిటీలు, మహిళల ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఈ ఆరోపణలకు స్పందించిన రామచందర్‌రావు.. ఓట్లు తొలగించారంటూ ఆధారాలు చూపించాలని కాంగ్రెస్ నేతలకు సవాల్ విసిరారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌పై రాహుల్‌గాంధీ పదేపదే ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు.

-కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టేందుకు ర్యాలీలు

ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని ప్రజల్లో ఎండగట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు, పాదయాత్రలు నిర్వహించనున్నట్లు రామచందర్‌రావు ప్రకటించారు. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి -- అరాచకత్వంపై పోరాడండి' అనే నినాదంతో ఈ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. నవంబర్ 1న హైదరాబాద్‌లో తొలి ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం నవంబర్ 3 లేదా 4న సిద్ధిపేటలో, నవంబర్ 5న కరీంనగర్‌లో ర్యాలీలు



చేపట్టనున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ తప్పుడు ప్రచారాన్ని ప్రజలకు వివరించడంతోపాటు, యువ తను రెచ్చగొట్టే ప్రయత్నాలను అడ్డుకుంటామని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, ఓటర్ల జాబితాలో అక్రమాలపై కాంగ్రెస్ తన పోరాటాన్ని కొనసాగిస్తోంది. ఈ అంశంపై నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ నేతలు పాల్గొననున్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ వివాదం మరింత ముదురుతోంది.

కేతేపల్లి ముందస్తు హెచ్చరికలు బెఖాతాలు చేసిన సర్కార్

-ఎండిపోయిన 14 చెరువులు. కుంటలు.
-అటవీ ప్రాంతాలలో తీవ్ర నీటి ఎద్దడి
-అల్లాడుతున్న వన్యప్రాణులు ఉత్తర తెలంగాణతో పోలిస్తే దక్షిణ
తెలంగాణలో ఎక్కువ దుర్భిక్షం.

తెహెల్కా న్యూస్ అక్టోబర్ 24 కేతేపల్లి ప్రతినిధి.

కేతేపల్లి మండలంలో చుట్టుపక్కల గ్రామాలలో చెరు వులు కుంటలు వెండిపోవడం వలన భూగర్భ జలాలు తగ్గడం బోర్లు సరిగా పోయకపోవడం పంట పొలాలు వెండి పోవడంతో రైతాంగం అస్త వేస్తాలకు గురి కావడం తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. వాన కాలంలో 24% లోతు వర్షపాతం నమోదయింది. ప్రాథమిక సమాచారం ప్రకారం రాష్ట్రంలో అన్ని మండలాలలో కరువు పరిస్థితులు ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది ఎల్ నీనో ప్రభావంతో ఈ ఏడాది తీవ్ర కరువు పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉన్నదని వాతావరణ నిపుణులు ముందుగానే అంచనా వేశారు. నిపుణులు ముందుగానే హెచ్చరిం చినప్పటికీ సర్కార్ పెడచెవిన పెట్టింది కురిసిన ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టాల్సింది పోయి నిర్లక్ష్యంగా



వ్యవహరించింది.

బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు

తెహెల్కా న్యూస్ భువనగిరి 24-10-2026.



జగన్ మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా జననీ ఫౌండేషన్ భువనగిరి, రోటరీ క్లబ్ ఆధ్వర్యం లో మున్సిపల్ కార్మికులకు సన్మానం, బట్టల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు 20 మంది కి భువనగిరి పట్టణంలో చేస్తున్న సేవలకు గాను పారిశుద్ధం చేస్తు న్నటువంటి వారికి సన్మానించి తదనంతరము వారికి నూతన బట్టలు పుట్టినరోజు సందర్భంగా ఇవ్వడం జరిగింది. 2005 నుంచి ఇప్పటివరకు నిర్విరామంగాప్రతి పుట్టినరోజు 24 అక్టోబర్ రోజున కార్మికులుతో పాలు పంచుకుం టూ వారి మధ్యనే పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటూ కార్మి కుల యొక్క ఆరోగ్యం మరియు యోగక్షేమాలను తెలుసుకొని వాళ్ళ అండగా నిలబ డాలని ప్రజల ఆరోగ్యం కాపాడడం కోసం రోజు నిత్యం శ్రమిస్తున్నటువంటి కార్మికులకు మనం అం డగా ఉండాలని ఈ సందర్భంగా జగన్మో హన్ రెడ్డి మాట్లాడుతూ తెలియ జేయడం జరిగింది, రాబోయే కాలంలో పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్యం విషయం లో మరియు వారికి ఇన్సూరెన్స్ విషయంలో మేము ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటామని ఈ సంద ర్భంగా తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో శెట్టి బాలయ్య రోటరీ క్లబ్ అధ్యక్షుడు సత్యనా రాయణ రెడ్డి, నిమ్మయ్య, జిట్ట భాస్కర్ రెడ్డి మా తల్లిదండ్రులు సావిత్రమ్మ పాండురంగ రెడ్డి వేణు మాజీ బిజెపి అధ్యక్షుడు ఉమా శంకర్,అశోక్ యాదవ్, బాల్ శంకర్, మధుసూదన్ రెడ్డి, అశోక్ కుమార్ గౌడ్, మొ దలగు వారు పాల్గొని అభినందనలు తెలియజేశారు.

రంగారెడ్డి జిల్లా బీజేవైఎం అర్బన్ వైస్ ప్రెసిడెంట్‌గా పంతంగి హర్ష యాదవ్ నియామకం

రంగారెడ్డి జిల్లా కూకట్ పల్లి తెహెల్కా న్యూస్ ప్రతినిధి తెల్ల హరికృష్ణ అక్టోబర్ 24



భారతీయ జనతా పార్టీ యువజన విభాగమైన భార తీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) రంగారెడ్డి అర్బన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా పంతంగి హర్ష యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా పం తంగి హర్ష యాదవ్ మాట్లాడుతూ, తన నియా మకానికి సహకరించిన శేరిలింగంపల్లి మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి రవికుమార్ యాదవ్, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాసరెడ్డికి, రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి తోపుకొండ మైపాల్ రెడ్డికి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుండే గణేష్‌కు, జిల్లా యువమోర్చా అధ్యక్షుడు పొట్లపల్లి సాయి కుమార్ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని, యు వతను పార్టీ సిద్ధాంతాల వైపు ఆకర్షిస్తూ బీజేవైఎంను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని హర్ష యాదవ్ పేర్కొన్నారు. యువత సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తూ, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, భారతీయ జనతా పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.

దసరా సందర్భంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ డివిజన్ బి ఆర్ స్ అధ్యక్షులు

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 24 తెహెల్కా న్యూస్



హైదరాబాద్ విజయదశమి దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు మర్యాద పూర్వక ంగా వారి నివాసం వద్ద కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేసి, వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు.ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్ యాదవ్, డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ , రుద్ర అశోక్,పోలే శ్రీకాంత్ కలిసి కేటీఆర్ను మర్యాద పూర్వకంగా వారి నివాసం లో కలిశారు. విజయ దశమి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసం తోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం నింపాలని, తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.బిఆర్ఎస్ పార్టీ బలోపే తానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సంక్షేమం కోసం పనిచేయాలనే సంకల్పంతో ముందుకు సాగా లని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగు ణంగా బిఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిరం తరం పోరాటం కొనసాగిస్తుందని, పార్టీ నాయకత్వం సూచనలతో ప్రజాసేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని నాయకులు తెలిపారు.

22 ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరిన శ్రీ విద్య పూర్వ విద్యార్థులు

-తీపి జ్ఞాపకాలతో ఆత్మీయ సమ్మేళనం..
గురువులకు కృతజ్ఞతలు

ఖమ్మం తెహెల్కా న్యూస్:



ఖమ్మం పట్టణంలోని శ్రీ విద్య ఇంటర్ కాలేజీ 2002--2004 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. స్థానిక మారమ్మ తల్లి ఆలయం సమీపంలోని అనుమూల దశవంత్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులంతా 22 ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరి తమ కళాశాల రోజుల మధుర జ్ఞాప కాలను నెమరువేసుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థి దశలో కలిసి చదువుకున్న రోజులు, స్నేహితులతో గడిపిన క్షణాలు, పండుగ సెలవుల్లో ఆటపాటలతో గడిపిన సమయం, కళాశాలలో జరిగిన వివిధ కార్య క్రమాలను గుర్తుచేసుకున్నారు. సెల్‌ఫోన్లు, ఆధునిక డిజిటల్ పరికరాలు అందుబాటులో లేని రోజుల్లో చదువుకే ప్రాధాన్యతనిస్తూ, స్నేహబంధాలకు విలువనిస్తూ గడిపిన కాలాన్ని గుర్తుచేసుకుని ఆనందం వ్యక్తం చేశారు. కొత్త సినిమాలు విడుదలై నప్పుడు స్నేహితులంతా కలిసి సినిమాలకు వెళ్లిన సందర్భాలు, కళాశాలలో చేసిన సరదాలు, అప్పటి విద్యావిధానం, ఉపాధ్యాయుల పట్ల విద్యార్థులకు ఉన్న గౌరవం వంటి అంశాలను పరస్పరం పంచు కున్నారు. అప్పట్లో నిర్వహించిన విద్యా, సాం స్కృతిక కార్యక్రమాలు తమలోని ప్రతిభను వెలికితీసి, మేధాశక్తిని పెంపొందించేందుకు దోహద పడ్డాయని పేర్కొన్నారు. తమ జీవితాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు కృతజ్ఞతా పూర్వకంగా స్మరించుకున్నారు. గురువులు అందిం చిన విద్యాబోధన, క్రమశిక్షణ, విలువలు తమ ప్రస్తుత జీవితానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపా రు. 2002--2004 బ్యాచ్‌కు చెందిన పలువురు ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రైవేట్ రంగాల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్నారని పేర్కొ న్నారు. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ కలుసుకోవడం తమకు ఎంతో ఆనందాన్ని, కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిందని తెలిపారు. పాత స్నేహాలను పునరుద్ధరించుకుంటూ, భవిష్యత్తులోనూ ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు.

పోచంపల్లి చేనేత వారసత్వం, సాంస్కృతిక పర్యాటక అభివృద్ధి కి పోచంపల్లి ఎక్స్‌పీరియన్స్ టూర్స్-జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

తెహెల్కా న్యూస్ భువనగిరి24-10-2026.

పోచంపల్లి ఇక్కత్ చేనేత వారస త్వాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు, గ్రామీణ సాం స్కృతిక పర్యాటకాన్నిప్రోత్సహిం చే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ అను రాగ్ జయంతి మార్గ దర్శకత్వం లో రూపొందించిన సుస్థిరపర్యా టక అభివృద్ధి ప్రణాళికలో భాగం గా పోచంపల్లి ఎక్స్‌పీరియన్స్ టూర్స్ కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ ఆధ్వ ర్యంలోచే పడుతున్న ఈ కార్యక్ర మం ద్వారా పోచంపల్లి చేనేత కళలు, సంప్రదాయాలు, గ్రామీణ జీవన విధానాన్ని పర్యాటకుల కు పరిచయం చేస్తున్నారు.ఈ కార్యక్ర మంలో భాగంగా కమ్యూనిటీ హైదరాబాద్ దక్కన్ అర్చివ్ సంస్థలు ప్రత్యేక పర్యాట కయాత్రలను నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా అక్టోబర్ 24 న కమ్యూనిటీ హైదరాబాద్ హెరిటేజ్ బృందానికి చెందిన సుమారు 30 మంది సభ్యులు పోచంపల్లిని సందర్శించారు.ఈ సందర్భంగా సందర్శకులు పోచంపల్లి ఇక్కత్ మ్యూజియా న్ని సందర్శించి,ఇక్కత్ చేనేత వస్త్రాల తయారీ ప్రక్రియ,వాటి చారిత్రక ప్రాధాన్యత,ప్రత్యేకమై న సాంకేతికతలు,చేనేత కార్మికు ల నైపుణ్యాలను తెలుసుకున్నా రు. చేనేత కార్మికులతో నేరుగా మాట్లాడి వస్త్రతయారీ లోని వివిధ దశలను పరిశీలించారు. స్థానిక చేనేత దుకాణాలు,గ్రామీ ణ వ్యవ సాయక్షేత్రాలను సంద ర్శించడంతో పాటు తెలంగాణ సంప్రదాయ భోజనాన్ని ఆస్వా దించారు. పోచంపల్లి కేవలం ప్రసిద్ధ చేనేత కేంద్రంగానే కాకుండా,వ్యవసా య ప్రకృతి దృశ్యాలు,స్థానిక సంప్రదాయాలు,హస్తకళలు, గ్రామీణ జీవన విధానంతో కూ డిన ప్రత్యేక పర్యాటక ప్రాంతమ ని ఈ పర్యటన ద్వారా సందర్శ కులు తెలుసుకున్నారు.

శ్రీ సీతారామాంజనేయ స్వామి సహిత సంతోషిమాత దేవాల యంలో అన్న ప్రసాదం



తెహెల్కా న్యూస్ భువనగిరి24-10-2026.

శ్రీ సీతారామాంజనేయ స్వామి సహిత సంతోషిమాత దేవాల యంలో అన్న ప్రసాద మునకు సహకరించిన దాతలు పోల గురునాథం 25kg బియ్యం లెక్కలపల్లి వేణుగోపాల్ కుమా రుడి జన్మదిన సందర్భంగా 5kg పెరుగు డొప్ప హరికృష్ణ కూరగా యలు, ఇట్ట బోయిన రాజు మంచి నీళ్ల ఇవ్వడం జరిగింది. అన్న ప్రసా దానికి సహకరించిన దాతలకు ఆస్వామి వారి కృపా కటాక్షాలు ఆయు రారోగ్యం ఐశ్వర్యం కలగాలి. ఈ కార్యక్రమంలో పంతుళ్ళు, దేవాలయ కమిటీ సభ్యులు, భక్తుల అధిక సంఖ్యలో పాల్గొ న్నారు.

నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం: ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



కుత్బుల్లాపూర్ అక్టోబర్ 24 తెహెల్కా న్యూస్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు, మరియు తదితరులు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలియజేశారు.

మేడిగడ్డ బ్యారేజీ పరిస్థితిపై క్షేత్రస్థాయి పరిశీలన

-వృథాగా వెళుతున్న నీటిని, ప్రాజెక్టు
-ప్రస్తుత పరిస్థితిని పరిశీలించిన -- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.

ఎల్బీనగర్,అక్టోబర్ 24,తెహెల్కా న్యూస్ ప్రతినిధి మురళీమోహన్ గౌడ్.

మేడిగడ్డ వద్ద ఇప్పటికే 751 టీఎంసీల నీళ్లు కిందికి వదిలే శారని, అందులో 200 టీఎంసీల నీళ్లు లిఫ్ట్ చేసినా హైదరాబాద్ తాగునీటి సమస్యతో పాటు,రైతులకు నీళ్లు అందించేవారని తెలిపిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు. ఇప్పటికీ కూడా మేడిగడ్డ వద్ద 22 వేల క్యూసెక్కుల నీళ్లు దిగువకు పారుతున్నయి.ఈ నీటిని లిఫ్ట్ చేసి కాళేశ్వరం ద్వారా నీళ్లు అందిస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందని,కాంగ్రెస్ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్ట్ కూలిపోయిందని చేసిన దుష్ప్రచారం తెలిసిపోతుందని నీటిని ఎత్తడం లేదు.వీటిని ప్రజలకు చూపించి,ఇప్పటికైనా నీటిని లిఫ్ట్ చేయా లని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు కన్నెపల్లి పంప్ హౌసు సంద ర్శించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి,కేపీ వివేకానంద,మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్ రెడ్డి,బండారు లక్ష్మారెడ్డి,మాజీ ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణగిరిలో ఘనంగా మూడో రోజు పవిత్రోత్సవాలు

-పవిత్రో త్సవాలలో చతుర స్థానార్చన అగ్ని ప్రతిష్ట

-కల్పవృక్ష వాహనం పై దర్శనమిచ్చిన స్వర్ణగిరీషుడు.

-చంద ప్రభ వాహనంపై ఊరేగిన శ్రీనివాసుడు.

తెహెల్కా న్యూస్ భువనగిరి24-10-2026.



తెలంగాణ రాష్ట్రంలోని ప్రాము ఖ్య వైష్ణవ పుణ్యక్షేత్రముగా విరా జిల్లుతున్న యాదాద్రి తిరుమల దేవస్థానం స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వ ర స్వామి దేవ స్థానంలో మూడో రోజు ఘనంగా ప్రారంభమైన పవిహ త్రోత్సవాలు. పవిత్రోత్సవాల మూడో రోజు శని వారం ఉదయం చతుస్థానార్చన కార్యక్రమాన్ని ఆలయఅర్చకులు శాశ్వతకంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలోని లక్ష్మీ మండపంలో ఏర్పాటు చేసిన జాగష్టాలలో అగ్ని ప్రతిష్ట కార్య క్రమాన్ని వేద మంత్రోచ్చారణల నడుమఘనంగా నిర్వహించారు వైదిక క్రతువులతోఆలయ ప్రాంగ ణం ఆధ్యాత్మిక వాతా వరణము తో నిండిపోయింది. పవిత్రోత్సవాల్లో భక్తులు పాల్గొని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య అనుగ్రహాన్ని పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవ స్థాపక ధర్మకర్త మానేపల్లి రామా రావు కుటుంబసమేతంగా పాల్గొ న్నారు.మూడవ రోజు సందర్భం గా శ్రీ వేంకటేశ్వర స్వామి వారు కల్పవృక్ష వాహనం పై కొలువు దీరి భక్తులకు దివ్య మంగళ రూపాన్ని దర్శన మిచ్చారు. కల్పవృక్ష వాహన సేవలో స్వామి వారిని దర్శించుకున్న భక్తులు గోవింద నామ స్మరణతో మానేప ల్లి హిల్స్ స్వర్ణగిరి క్షేత్రాన్నిమార్మో గించారు. కల్పవృక్ష వాహనం పై విరాజిల్లిన శ్రీవారి దివ్య రూపం భక్తులకు కనుల పండువగా నిలి చి పొయింది. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారు చంద్ర ప్రభవాహనం పైన ఆలయ మాడవీధులలోతిరు గుతూ భక్తులకు స్వామివారి ది వ్య స్వరూపాన్ని ప్రసాదించారు. స్వామి వారిదివ్య మంగళస్వరూ పాన్ని చూసి భక్తులు ఆనంద ప రవశులయినట్లు ఆలయ నిర్వా హకులు తెలిపారు.


బంగారం ధరలు


manepally®
Jewellers Pvt. Ltd.
trusted legacy since 1890
MANEPALLY DIGITAL GOLD APP
Google play App Store
GOLD & SILVER RATES

24 kt	₹	1,42,590	10gms
22 kt	₹	1,30,700	10gms
SILVER	₹	2,02,900	1kg

Contact: 6309 111299 | 99120 10888

కాంగ్రెస్ ప్రభుత్వం పై నరేందర్ రెడ్డి ఫైర్

-కరువు వస్తుందని ముందే చేతులెత్తేస్తారా..?

ప్రజలకు ఇచ్చిన హామీల మాటేమిటి?

కుత్బుల్లాపూర్ : అక్టోబర్ 24 : తెహెల్కా న్యూస్

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు, ప్రజలకు సమాధానం చెప్పాలి: బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి కరువు పరిస్థితులు ఏర్పడే అవకా శాలను సాకుగా చూపి కాంగ్రెస్ ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పించుకోవాలని చూస్తోందని జీడి మెట్ల 132 డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయ కులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి విమర్శించారు ఎల్‌నినో ప్రభావం ఉన్నా, కరువు పరిస్థితులు ఎదురైనా రైతు లకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందిం చడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నప్పుడు ముందుగానే ప్రణాళి కలు సిద్ధం చేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, సమస్యలు వస్తాయని ముందే చెప్పి చేతులెత్తేయడం సరికాదన్నారు. రైతులు, సామాన్య ప్రజలు ఇబ్బం దులు పడకుండా ప్రభుత్వం తక్షణమే కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్ హయాంలో రైతులకు అండగా నిలిచాం

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ, సాగునీటి ప్రాజెక్టులు, రైతుబంధు, ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాలతో రైతులకు అండగా నిలిచామని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా సాగునీరు, తాగునీటి సమస్యలపై ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆరు గ్యారెంటీల అమలుపై స్పష్టత ఇవ్వాలి

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుబంధు స్థానంలో రైతు భరోసా, పంట రుణమాఫీ, ఉచిత విద్యుత్‌తో పాటు ఆరు గ్యారెంటీల అమలు పరిస్థితిని స్పష్టం చేయాలన్నారు. కరువు పరిస్థితులను సాకుగా చూపి హామీలను పక్కనపెట్టడం సరికాదని అన్నారు.

రైతులకు అన్యాయం జరిగితే బీఆర్ఎస్ పోరాడుతుంది

రైతులు సాగునీటి కోసం, ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం చర్యలు



తీసుకోవాలని నరేందర్ రెడ్డి కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రభుత్వం తన చిత్తశు ద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

అధికారులకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించండి వాటర్ వర్క్స్ అధికారులకు సిపిఐ వినతి పత్రం

కుత్బుల్లాపూర్ : అక్టోబర్ 24 :తెహెల్కా న్యూస్

ఎల్నీనో కారణంగా రాబోవు రోజుల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుంది కాబట్టి ప్రజలను అప్రమత్తత చేయడానికి, నీటి వృధాను అరికట్టడానికి వాటర్ వర్క్స్ అధికారులు అన్ని బస్తీలలో పర్యటించి ప్రజలను చైతన్యపరిచి నీటిని వృధా చేయకుండా చూడాలని నేడు సిపిఐ ఆధ్వర్యంలో చింతల్ సర్కిల్ వాటర్ వర్క్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ వికాస్ వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ ,రాష్ట్ర నాయకులు ఏసు రత్నం మాట్లాడుతూ బస్తీలలో మంచినీరు సరఫరా చేసే సమయంలో అధికారులు పర్యటించి ఎవరైతే నీరు వృధా చేస్తున్నారో వారికి జరిమానా విధిస్తే నీటిని వృధా చేసే మిగతా ప్రజలు కూడా భయపడి నీటిని వృధా చేయకుండా ఉంటారని అన్నారు రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే అనేకసార్లు ప్రజలకు విజ్ఞప్తి చేశారని , నీటి వృధానీ అరికట్టాల్సిన వాటర్ వర్క్స్ అధికారులు అధికారులు కూడా ప్రకటనలకే పరిమితమైతే సరిపోదని వెంటనే క్షేత్రస్థాయి పర్యట నలు మొదలుపెట్టాలని అదేవిధంగా అక్రమంగా నడుస్తున్న వాటర్ ప్లాంట్లను కూడా మూసివేయాలని



డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు గిరి నగర్ మరియు జగద్గిరి గుట్టలో వివిధ ప్రాం తాలలో వివిధ బస్తీలలో ఎక్కడె క్కడ నీరు వృధాగా పోతుందో వాటి వివరాలను వాటర్ వర్క్స్ అధికా రులకు ఇవ్వడం జరిగింది వారం రోజుల్లోపు సిపిఐ ఇచ్చిన డిమాండ్లను పరిష్కరిం చాలని లేనిపక్షంలో అధికారుల నిర్లక్ష్యానికి వ్యతిరే కంగా ధర్నా నిర్వహి ంచాల్సి వస్తుందని హెచ్చరిం చారు. ఈ కార్యక్ర మంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వి శ్రీనివాస్ సిపిఐ మండల కార్యదర్శి కే స్వామి సహాయ కార్య దర్శి హరినాథ్ రావు ప్రజానాట్య మండల అధ్య క్షులు బాబు యువజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు ప్రవీ ణ్, కీర్తి శాఖ కార్యదర్శి వెంకటేష్, యాకూబ్, సిపిఐ నాయకులు ఇమామ్ యాదన్న, సాగర్, రాజేష్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

జనగామలో పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం

-జనగామ సిఐ సత్యనారాయణ రెడ్డి

(జనగామ అక్టోబర్ 24 తెహెల్కా న్యూస్ ప్రతినిధి సాగర్)

జనగామ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కూడెలి లో పోలీస్ కంట్రోల్ రూమ్ ఆవరణలో పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా వరంగల్ పోలీస్ కమి షనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ మరియు జనగామ డీసీపీ రాజా మహేంద్ర నాయక్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జనగామ పట్టణంలో కళాబృందం ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జనగామ సిఐ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ. విధి నిర్వ హణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను, సేవలను స్మరించుకుంటూ ప్రజలకు అవగాహన కల్పించారు. కళాకారులు నాటికలు, పాటల రూపంలో పోలీసు అమరవీరుల ధైర్యసా హసాలు, అంకితభావం, త్యాగాలను వివరించి,



సమాజానికి వారు అందించిన అమూల్యమైన సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జనగామ సి ఏ సత్యనారాయణ రెడ్డి ఎస్ఐలు మరియు పోలీస్ సిబ్బంది కళాకారులు తదితరులు పాల్గొన్నారు

భువనగిరి 35వ వార్డు ఆర్ బి నగర్ లో రేషన్ కార్డుల పంపిణీ



తెహెల్కా న్యూస్ భువనగిరి24-10-2026.

పట్టణంలోని 35వ వార్డు ఆర్.బి నగర్ లో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ హాజరై లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ తంగళ్లప ల్లి శ్రీవాణి రవికుమార్ మాట్లాడు తూ... కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో భువనగిరిఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహ కారంతో పేదల సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని,అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందేలా చూస్తామని అన్నారు. ఆర్ బినగ ర్ లో చాలా మంది రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారని,వా రందరికీ న్యాయంచేస్తూ కార్డు లు పంపిణీ చేయడం సంతో షంగా ఉందని తెలిపారు. రేషన్ కార్డు కేవలం బియ్యం కోసమే కాదు,అన్ని సంక్షేమ పథకాలకు అదే ఆధాం మని అన్నారు. రేషన్ కార్డులు అందుకున్న లబ్ధి దారులు సంతోషం వ్యక్తం చేస్తూ చైర్మన్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ తంగళ్లపల్లి రవికుమార్,కుమార్ నజీర్,35,వార్డుల కాంగ్రెస్ నాయ కులు,కార్యకర్తలు,మహిళలు,ల బ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొ న్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన కౌన్సిలర్లు జాలిగంవిష్ణేష్ బొంతల నర్సింగరావు.



తెహెల్కా న్యూస్ భువనగిరి24-10-2026.

పట్టణ రామ్ నగర్ లోని రేషన్ దుకాణం వద్దలోని22 వ వార్డుల కు సంబందించిన రేషన్ కార్డుల ను కౌన్సిలర్ల చేతుల మీదుగా లబ్దిదా రులకు అందజేయడం జరిగింది. ఈసందర్భంగా కౌన్సిలర్లు మాట్లా డుతూ.. కాంగ్రెస్ పాలనలోనే పేద ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతు న్నాయని,అర్హులైన పేద ప్రజలు ఎప్పుడైనా రేషన్ కార్డుకు దరకాస్తు చేసుకోవచ్చని, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భువనగిరి వే గంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్ర మంలో వార్డు అధికా రులు ప్రణయ్,జావేద్ మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

డ్రై అండ్ వేస్ట్ సిగ్రిగేషన్ మిషిన్ ఏర్పాటు

-జనగామ మున్సిపల్ చైర్పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్

(జనగామ అక్టోబర్ 24 తెహెల్కా న్యూస్ ప్రతినిధి సాగర్)



జనగామ మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డులో తడి, పొడి చెత్తను వేర్వేరు చేయడానికి (డ్రై అండ్ వెట్ వేస్ట్ సిగ్రిగేషన్ మెషిన్ ఏర్పాటు చేయనున్న యంత్రానికి జనగామ మున్సిపల్ ఛైర్పర్సన్ కడకంచి బాలమణి-శ్రీనివాస్ భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్ రాజశేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా సనా రామ్ మోహన్ రెడ్డి



(హైదరాబాద్ అక్టోబర్ 24 తెహెల్కా న్యూస్)

ఎమ్మెల్సీగా సాన రామ్మోహన్ రెడ్డి కోసం సంక్షిప్త మరియు స్ఫూర్తిదాయకప్రసంగం సీనియర్ కాంగ్రెస్ సభ్యులారా, మరియు నా ప్రియమైన స్నేహితులారా, కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి, తెలంగాణ ప్రజలకు సాధికారత కల్పించడానికి ఒకే దృష్టితో, ఒకే స్వరంతో, ఒకే లక్ష్యంతో ఏకమై నిలబడ్డాము. సానా రామ్ మోహన్ రెడ్డి నాయకత్వం, అంకితభావం, ప్రజా సేవ పట్ల నిబద్ధత దృష్ట్యా, ఆయన ఎమ్మెల్సీ కావడానికి మన మద్దతు అవసరం. ప్రజల మాట వినే, యువతకు అండగా నిలిచే, సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి కోసం పనిచేసే నాయకులు మనకు కావాలి. మన పార్టీని ఏకం చేయడంలో, కాంగ్రెస్ సిద్ధాంతాన్ని బలోపేతం చేయడంలో, ప్రజల గొంతును ప్రభుత్వానికి వినిపించడంలో టీపీసీసీ (తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ) కీలక పాత్ర పోషిస్తుంది. బలమైన టీపీసీసీ అంటే మరింత బలమైన కాంగ్రెస్, తెలంగాణకు ఉజ్వల భవిష్యత్తు. మనమందరం ఐక్యంగా నిలబడదాం, అర్హులైన నాయకత్వానికి మద్దతు ఇద్దాం, మరియు మన ప్రజల సంక్షేమం కోసం దృఢ సంకల్పంతో పనిచేద్దాం. మన బలం ఐక్యత, మన మార్గం సేవ, మన లక్ష్యం మరింత పటిష్టమైన తెలంగాణ! ఎమ్మెల్సీ పదవికి సనా రామ్ మోహన్ రెడ్డి కి మద్దతుగా మన గళాన్ని వినిపిద్దాం. జై కాంగ్రెస్! జై తెలంగాణ! పూనం అశోక్ గౌడ్ జీ నాయకత్వంలో టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ మెట్చల్ మల్కా గిరి అభిలాష్ ప్రభాకరన్ పూర్తి మద్దతు అందించారు.

పాతనగర కాంగ్రెస్ నాయకుడుగా ప్రజా నాయకుడిగా స్వర్గీయ ఎస్ పాండురంగా రావు సేవలు మరువలేనివి

-పీసీసీ అధ్యక్షులు, రాష్ట్ర ప్రభుత్వ బీసీ సంక్షేమ శాఖ సలహాదారులు వి.హనుమంత రావు అన్నారు.



(హైదరాబాద్ అక్టోబర్ 24 తెహెల్కా న్యూస్ ప్రతినిధి సాగర్)

హైదరాబాదులోని పాండురంగ రావు స్వర్గీయ 25వ వర్ధంతి సంద ర్భంగా మిత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో రాజన్నబొలి ఫలకానమా రెయిన్ బో ఫౌండేషన్ అనాధ బాలికల ఆశ్రమములో ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమంలో వి.హెచ్ ముఖ్య అతిథిగా పాల్గొని పాండురంగ రావు చిత్రపటం వద్ద నివాళులు అర్పించి, బాలికలకు దుప్పట్లు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వి.హెచ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాండురంగారావు నిరంతరం కృషి చేసి ప్రజా నాయకుడిగా చెరగని ముద్ర వేశారని గుర్తుకుచేశారు. ఈ కార్యక్ర మంలో నాయకులు ఆర్.లక్ష్మణ్ యాదవ్, మిత్ర యువజన సంఘం అధ్యక్షుడు సి.కాశీనాథ్, ప్రధాన కార్యదర్శి ఎస్.పి.క్రాంతి కుమార్, సభ్యులు కె.సోమయ్య, బి.నితిన్ చారి, ఎస్.కరణ్ కుమార్, వి.యజత్, అభిలాష్, సుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

డిఫాల్ట్ రైస్ మిల్లర్లకు 45 రోజుల గడువు

సూర్యాపేట ,అక్టోబర్24 (తెహెల్కా న్యూస్)



జీఓ ఎంఎస్ నెం. 17 ప్రకారం, డిఫాల్ట్ మిల్లర్లు బాకీ పడిన సీఎంఆర్ బియ్యాన్ని 45 రోజుల్లోపు ప్రభుత్వానికి చెల్లించాలి. బియ్యాన్ని సన్న బియ్యం రూపంలో ఇవ్వాలి, లేదా దానికి సరిపడా ధరను 25% పెనాల్టీ, 12% వడ్డీతో కలిపి చెల్లించాలి.కమిషనర్, సివిల్ సప్లైస్ ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధ్యక్షతన డిఫాల్ట్ రైస్ మిల్లర్లతో రివ్యూ మీటింగ్ నిర్వహించబడింది. ఈ సమావేశంలో సివిల్ సప్లైస్ టాస్క్ ఫోర్స్ ఓఎస్డి శ్రీ ప్రభాకర్ , అడిషనల్ కలెక్టర్ బి. హరి సింగ్ పాల్గొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన 45 రోజుల గడువును సద్వినియోగం చేసుకుని బాకీ ఉన్న సీఎంఆర్ బియ్యాన్ని అప్పగించాలని మిల్లర్లకు సూచించారు. గడువులోపు చెల్లించని మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. రెవెన్యూ రికవరీ యాక్ట్, 1864 ప్రకారం వారి ఆస్తులను జప్తు చేస్తామని స్పష్టం చేశారు. జిల్లా సివిల్ సప్లైస్ అధికారులు, టాస్క్ ఫోర్స్ బృందం బకాయిలు చెల్లించని మిల్లులను ఇప్పటికే సందర్శిస్తున్నారు. మిల్లు యజమానుల, వారి కుటుంబ సభ్యుల ఆస్తి వివరాలను సేకరించడం ప్రారంభించారు. సమావేశం ముగిసిన వెంటనే ధనలక్ష్మి రైస్ మిల్ యజమాని శ్రీ గంగిరెడ్డి ఆదినారాయణ రెడ్డి తమ బాకీ మొత్తాన్ని 100% చెల్లించారు. ఆ మొత్తానికి చెక్కును జిల్లా మేనేజర్, సివిల్ సప్లైస్ శ్రీ వి. శ్రీధర్ రెడ్డి కి అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీ వి. మోహన్ బాబు , డిప్యూటీ తహసీల్దార్లు, టాస్క్ ఫోర్స్ బృందం కూడా పాల్గొన్నారు.

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఒక ప్రమాదకర నేరస్థుడి పై పీడీ చట్టం ప్రయోగం

అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్‌తెహెల్కా న్యూస్

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, ఐ.పి.ఎస్., నాగారాజు రఘు వర్మ అలియాస్ నాగారాజు కార్తికేయ రఘు వర్మ అలియాస్ వంశీ అలియాస్ అల్లూరి విజయ రామ్ అలియాస్ కల్నల్ కార్తికేయ సింగ్ అనే ప్రమాదకరమైన నేరస్థుడిపై 'పీడీ చట్టం' (Preventive Detention Act) ప్రయోగించారు. ఇతను ఆస్తి సంబంధిత నేరాలకు పాల్పడటంలో కుఖ్యాతి గాంచిన వ్యక్తి. భవిష్యత్తులో ఇతను మరిన్ని నేరాలకు పాల్పడకుండా నిరోధించే ఉద్దేశంతో, ఇతనిని మెడ్చల్ జిల్లాలోని చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ నేరస్థుడు ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లాకు చెందినవాడు. హైదరాబాద్‌కు వలస వచ్చిన ప్రారంభ రోజుల్లో డ్రైవర్‌గా పనిచేశాడు. ఆ తర్వాత, సులభంగా డబ్బు సంపాదించి విలాసవంతమైన జీవితాన్ని గడపాలనే ఉద్దేశంతో నేరాల బాట పట్టాడు. ఇతను పోలీసు అధికారిగా నటిస్తూ, బాధితులపై వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని నమ్మించి వారిని మోసం చేసేవాడు. చట్టపరమైన చర్యలు తీసుకుం టామని భయపెట్టి, కేసుల నుండి కాపాడతామని చెప్పి డబ్బులు వసూలు చేసేవాడు. అంతేకాకుండా, వ్యక్తులను కిడ్నాప్ చేసి, తుపాకులు చూపించి వారి వద్ద ఉన్న నగదును దోచుకునేవాడు. 2017 నుండి 2026 మధ్య కాలంలో, ఇతను మోసం, కిడ్నాప్, దోపిడీ, బలవంతపు వసూళ్లు (extortion), బెదిరింపులు మరియు ఆయుధ చట్టం (Arms Act, 1959) కింద నమోదైన 14 నేరాల్లో నిందితుడిగా ఉన్నాడు. గతంలో కూడా సైబరాబాద్ పోలీసులు ఇతనిపై 2021 మరియు 2024 సంవత్సరాల్లో పీడీ చట్టాన్ని ప్రయోగించారు. అయితే, జైలు నుండి విడుదలైన తర్వాత కూడా ఇతను తన నేర ప్రవృత్తిని మార్చుకోకుండా, మళ్లీ పోలీసు అధికారిగా నటిస్తూ కిడ్నాప్, దోపిడీ మరియు బలవంతపు వసూళ్లకు సంబంధించిన మరో నాలుగు కేసుల్లో నిందితుడిగా మారాడు. తాజా కేసులకు సంబంధించి, సైబరాబాద్ పరిధిలోని జగద్గిరిగుట్ట పోలీసులు ఇతనిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. గతంలో తీసుకున్న నివారణ చర్యలు (PD Act) ఉన్నప్పటికీ, ఇతను పదేపదే నేరాలకు పాల్పడుతుండటాన్ని పరిగణనలోకి



తీసుకున్న పోలీసులు, మరోసారి ఇతనిపై పీడీ చట్టాన్ని ప్రయోగించి జైలులో ఉంచారు. అపరాధిగారి పేరు మరియు చిరునామా: నాగరాజు రఘు వర్మ ఏ నాగరాజు కార్తికేయ రఘు వర్మ ఏ వంశీ ఏ అల్లూరి విజయ రామ్ ఏ కల్నల్ కార్తికేయ సింగ్, S/o నాగరాజు పద్మనాభరాజు ఏ పెద్దరాజు, వయస్సు: 29 సంవత్సరాలు, ఆంధ్ర ప్రదేశ్ పశ్చిమ గోదావరి జిల్లా, పోడూరు మండలం, స్వస్థలం.

ఆంధ్ర హౌస్ నూతన రెస్టారెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కూకట్ పల్లి పాత్రికేయులు

కూకట్ పల్లి తెహెల్కా న్యూస్ ప్రతినిధి తెల్ల హరికృష్ణ
అక్టోబర్ 24



కూకట్‌పల్లి వివేకానంద నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆంధ్ర హౌస్ రెస్టారెంట్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. రెస్టారెంట్ నిర్వాహకులు క్రాంతి కుమార్, గోపి చారి మరియు వారి మిత్రుల ఆహ్వానం మేరకు కూకట్ పల్లి పాత్రికేయులు రాష్ట్ర బీసీ నాయకులు జర్నలిస్టు తెల్ల హరికృష్ణ, మైత్రి కన్స్ట్రక్షన్స్ ఎండి దాసరి రాహుల్ ప్రదీప్, ఎడ్ల రంజిత్, నామాల శ్రీధర్, మారుతి సాగర్, కాసాని రంజిత్, అనిల్ యాదవ్ ఈ కార్యక్రమానికి హాజరై రెస్టారెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఘన స్వాగతం పలికి అతిథులను శాలువాతో సన్మానించారు. అనంతరం తెల్ల హరికృష్ణ రెస్టారెంట్ నిర్వాహకులు క్రాంతి కుమార్, గోపి చారి మరియు వారి మిత్రులను అభినందిస్తూ, ఆంధ్ర హౌస్ రెస్టారెంట్ ప్రజల ఆదరణ పొందుతూ విజయవంతంగా కొనసాగాలని, లాభాల బాటలో పయనించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా, వినియోగదారులకు రుచి, శుచి, నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించాలని, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రెస్టారెంట్‌కు వచ్చే వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెస్టారెంట్ నిర్వాహకులు, వారి మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ నగర్ డివిజన్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం

తెహెల్కా న్యూస్ అక్టోబర్ 24



కూకట్‌పల్లి నియోజకవర్గం పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి రంగారెడ్డి మహబూబ్‌నగర్--హైదరాబాద్ పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ అధికార ప్రతినిధి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సత్యం శ్రీరంగం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాదు ప్రతాప్ రెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన బి. సంజీవరావు హాజరయ్యారు. అలాగే బాలాజీ నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజేష్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గొట్టిముక్కల జశ్వంత్ రావు (దేశాల్), క్రిస్టియన్ మైనారిటీ కోఆర్డినేటర్ మేకల మైఖేల్, ఉమ్మడి కేపీహెచ్‌బీ డివిజన్ మాజీ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్, కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీ చేసిన విట్టల్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ, పట్టభద్రు లందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని, ప్రజా స్వామ్య వ్యవస్థలో విద్యావంతుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా నిర్వ హించి, అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. శేరి సతీష్ రెడ్డి అధ్యక్షులు, కూకట్‌పల్లి నియో జకవర్గం

సర్కిల్ ఇన్స్పెక్టర్ స్వామి గౌడ్ ని మర్యాద పూర్వకంగా కలిసిన తెలంగాణా బీసీ వికాస్ సమితి సభ్యులు

కూకట్ పల్లి తెహెల్కా న్యూస్ ప్రతినిధి తెల్ల హరికృష్ణ
అక్టోబర్ 24



కూకట్పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ స్వామి గౌడ్ ని మర్యాద పూర్వకంగా కలిసి, బోనలా పండుగ, గణపతి ఉత్సవాలు, షేర్ణ నవరాత్రుల దసరా పండుగలు, ఎలాంటి అవాంఛనీయ జరగకుండా శాంతి భద్రాలు నిర్వహించడం జరిగింది, కావున పోలీలకు సీఐ కి కృతజ్ఞతలు తెలియజేసిన తెలంగాణా బీసీ వికాస్ సమితి అధ్యక్షులు భాశెట్టి నర్సింగరావు, బీసీ వికాస్ సమితి సైబరా బాద్ అధ్యక్షులు చిలక ప్రకాష్ ముది రాజ్, మానవ సేవా మాధవ సేవా అధ్యక్షులు గోకర్ల లక్ష్మి నారాయణ, బీసీ వికాస్ సమితి మూసాపేట్ డివిజన్ అధ్యక్షులు మక్కాల్ రాజు, జి, యాదిలాల్ తదితరులు సీఐ సర్ ని కలిసిన వారిలో ఉన్నారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

తెహెల్కా న్యూస్ అక్టోబర్ 24 మిర్యాలగూడ:



పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగం గా మిర్యాలగూడ డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) ప్రారంబి ,ంచారు. ఈ సందర్భంగా పోలీస్ అమరవీరులకు నివాళులర్పించి, వారి సేవలను స్మరించుకున్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తదాతల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, పోలీస్ అధికారులు, లయన్స్ క్లబ్ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రక్తదాతలు పాల్గొన్నారు.

బిజినెస్

ద్రవ్యోల్బణంలోనూ తక్కువ ధరకే ఫుడ్.. మెక్‌డొనాల్డ్స్‌కు కస్టమర్ల క్యూ



ఇంటర్నెట్ డెస్క్: ఖర్చులు పెరిగినప్పుడు సాధారణంగా మనలో చాలా మంది హోటళ్లు, రెస్టారెంట్లలో తినడం తగ్గిస్తారు. ఖర్చులను తగ్గించుకునే ప్రయత్నం చేస్తారు. అదే సమయంలో తక్కువ ధరకు మంచి ఆహారం అందించే రెస్టారెంట్ల వైపు చూస్తారు. దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం ఆగస్టులో 4.83 శాతం ఉండగా, సెప్టెంబర్‌లో అది 5.54 శాతానికి పెరిగింది. ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం కూడా 5.97 శాతం నుంచి 7.74 శాతానికి పెరిగింది. ఈ పరిస్థితుల్లో వినియోగదారులకు తక్కువ ధరకు ఆహారం అందిస్తూ ఖర్చులను నియంత్రించడంపై వెస్ట్‌లైఫ్ ఫుడ్‌వరల్డ్ దృష్టి పెట్టింది. ఈ సంస్థ పశ్చిమ, దక్షిణ భారతదేశంలో మెక్‌డొనాల్డ్స్ రెస్టారెంట్లను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా రూ.99కే భోజనం అందిస్తోంది. ఆ సంస్థ సీఈఓ అక్షయ్ జాటియా మాట్లాడుతూ.. పరిస్థితులు కష్టంగా ఉన్నప్పటికీ మెక్‌డొనాల్డ్స్ మంచి ధరకు ఆహారం అందిస్తోందని చెప్పారు. ధరలను భారీగా తగ్గించకుండా, ఎక్కువగా పెంచకుండా వినియోగదారులకు మంచి ఆహారం అందించడమే తమ లక్ష్యమని తెలిపారు.కంపెనీ అమ్మకాలు ఇలా.. సెప్టెంబర్ త్రైమాసికంలో వెస్ట్‌లైఫ్ ఫుడ్‌వరల్డ్ మంచి వృద్ధిని నమోదు చేసింది. ఆదాయం నిరుటితో పోలిస్తే 16 శాతం పెరిగి రూ.747 కోట్లకు చేరింది. స్టోర్‌లో అమ్మకాలు 10. శాతం పెరిగాయి. కస్టమర్ల సంఖ్య ప్రతి నెలా రెండంకెల శాతంలో పెరిగింది. రెస్టారెంట్‌లో కూర్చొని తినే వారి అమ్మకాలు 17 శాతం పెరిగాయి. పార్సిల్, ఇతర మార్గాల్లో జరిగే అమ్మకాలు 15 శాతం పెరిగాయి. ధరల పెరుగుదల ఉన్నప్పటికీ..

జియో ఐపీఓ రికార్డుల హోరు



న్యూఢిల్లీ: మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన టెలికాం, డిజిటల్ సేవల అనుబంధ సంస్థ జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ (జేపీఎల్) ఐపీఓ సరికొత్త రికార్డులు సృష్టించింది. శుక్రవారంతో ముగిసిన ఈ మెగా ఐపీఓకు 22.19 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది. యాంకర్ ఇన్వెస్టర్లు మినహా మిగతా విభాగాల ఇన్వెస్టర్లకు ఆఫర్ చేసిన 19.75 కోట్ల షేర్లకు గాను 438.3 కోట్ల షేర్ల కొనుగోలుకు బిడ్లు వచ్చాయి. ఆ బిడ్ల విలువ రూ.4.9 లక్షల కోట్లు. యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి లభించిన రూ.2.5 లక్షల బిడ్లతో కలిపితే.. మొత్తం బిడ్ల విలువ రికార్డు స్థాయిలో రూ.7.4 లక్షల కోట్లకు చేరుకుంది. అంతేకాదు, ఐపీఓలో పెట్టుబడుల కోసం అనూహ్యంగా 1.39 కోట్ల దరఖాస్తులు వచ్చాయి. ప్రపంచంలో ఒక ఐపీఓకు వచ్చిన అప్లికేషన్లలో ఇదే అత్యధికం. 2024 అక్టోబరులో సోలార్ పరికరాల తయారీదారు వారీ ఎనర్జీస్ ఐపీఓకు 97.34 లక్షల అప్లికేషన్లు నమోదయ్యాయి.ఈ ఐపీఓలో అర్హులైన సంస్థాగత కొనుగోలుదారుల (క్యూఐబీ)కు కేటాయించిన 4.9 కోట్ల షేర్లకు గాను 345.8 కోట్ల షేర్ల కొనుగోలుకు బిడ్లు దాఖలయ్యాయి. అంటే, ఈ విభాగ షేర్లకు ఏకంగా 70.55 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది. ఈ ఇష్యూలో అత్యధిక రెట్ల బిడ్లు నమోదైన విభాగమిదే.

మారుతి విక్టోరిస్ 'ఆరమ్' ఎడిషన్ విడుదల.. ఏం మారిందంటే..?



ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి తన మిడ్‌సైజ్ ఎస్‌యూవీ విక్టోరిస్ తొలి వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆరమ్ ఎడిషన్‌ను భారత్‌లో విడుదల చేసింది. ఈ ప్రత్యేక ఎడిషన్ కోసం రూ.22,990 ధరతో యాక్సెసరీ కిట్‌ను అందుబా టులోకి తీసుకొచ్చింది. విక్టోరిస్ స్ట్రాంగ్ హైబ్రిడ్ వేరియంట్ ఆధారంగా దీన్ని రూపొందించింది. సాధారణ విక్టోరిస్ ధరలు ఎక్స్-షోరూమ్‌లో రూ.10.50 లక్షల నుంచి రూ.19.99 లక్షల వరకు ఉన్నాయి.ఆరమ్ ఎడిషన్‌లో ప్రధానంగా కారు రూపురేఖలకు సంబంధించిన మార్పులు చేశారు. ముందు, పక్క, వెనుక స్కిడ్ ప్లేట్లతోపాటు వీల్ ఆర్చ్‌లపై కాపర్ రంగు ఇన్‌సర్ట్‌లను ఇచ్చారు. ముందు గ్రిల్, ఫెండర్లు, బంపర్లు, బాడీ సైడ్ మౌల్డింగ్‌లు, డోర్ వైజర్లకు క్రోమ్ అలంకరణలు జోడించారు. కారులో ఆల్-వెదర్ 3డీ క్యాబిన్ మ్యాట్లు, 3డీ బూట్ మ్యాట్, వెనుక ట్రంక్ సిల్ గార్డ్‌ను కూడా అందిస్తున్నారు. ఆరమ్ అనే పేరు లాటిన్ భాషలో బంగారాన్ని సూచిస్తుంది. ఈ ఎడిషన్ ద్వారా విక్టోరిస్ తొలి ఏడాది విజయాన్ని సంస్థ గుర్తుచేస్తోంది. ఈ ప్రత్యేక ఎడిషన్‌లో ఇంజిన్ లేదా గేర్‌బాక్స్ మార్పులు చేయలేదు. ఇందులో 1.5 లీటర్ల పెట్రోల్ ఇంజిన్, ఎలక్ట్రిక్ మోటార్, లిథియం-అయాన్ బ్యాటరీతో కూడిన స్ట్రాంగ్ హైబ్రిడ్ వ్యవస్థనే కొనసాగిస్తున్నారు. ఈ వ్యవస్థ గరిష్ఠంగా 116 హెచ్‌పీ శక్తిని, 122 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ-సీవీటీ ట్రాన్స్‌మిషన్‌తో పాటు ఈవీ మోడ్ సదుపాయం కూడా ఉంది. విక్టోరిస్ సాధారణ శ్రేణిలో పెట్రోల్, సీఎన్‌జీ ఆప్షన్లు సైతం అందు బాటులో ఉన్నాయి. అయితే, ప్రస్తుతం ప్రకటించిన ఆరమ్ ఎడిషన్ స్ట్రాంగ్ హైబ్రిడ్ వేరియంట్‌పై ఆధారపడి ఉంటుంది. విక్టోరిస్ తొలి ఏడాదిలో మొత్తం 1,47,602 కార్ల అమ్మకాలు నమోద య్యాయి. కొత్తగా విడుదలైన ప్యాసింజర్ వాహనాల్లో తొలి ఏడాది అత్యధిక అమ్మకాలు సాధించిన మోడల్‌గా నిలిచిందని మారుతి సుజుకి తెలిపింది. 2026 జనవరిలో అత్యధికంగా 15,240 యూనిట్లు అమ్ముడయ్యాయి. ఏడాదిలో చాలా నెలలు అమ్మకాలు 10 వేల నుంచి 13 వేల యూనిట్ల మధ్య కొనసాగాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేక ఎడిషన్‌ను తీసుకొచ్చింది.

"నువ్వుంటే చాలు గెలుస్తాం".. కోచ్‌ల నమ్మకాన్ని నిలబెట్టిన తిలక్ వర్మ



న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టీ20లో భారత జట్టు అద్భుత విజయం సాధించింది. ఓటమి అంచున నిలిచిన జట్టును యువ సంచలనం తిలక్ వర్మ తన అద్భుత బ్యాటింగ్‌తో గెలిపించాడు. క్రైస్ట్‌చర్చ్‌లోని హేగ్లీ ఓవల్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో, 181 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ చివరి ఓవర్‌లో విజయాన్ని అందుకుంది. కేవలం 26 బంతుల్లో అజేయంగా 51 పరుగులు చేసిన తిలక్ వర్మ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.మ్యాచ్ అనంతరం తిలక్ వర్మ మాట్లాడుతూ, తన అద్భుత ఇన్నింగ్స్ వెనుక ఉన్న స్ఫూర్తిని వెల్లడించాడు. 'ఆటకు ముందు, నేను కోచ్ గౌతమ్ గంభీర్ సర్, బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ సర్‌తో మాట్లాడాను. వారు నాతో ఒక్కటే చెప్పారు, 'మేమంతా నిన్ను నమ్ముతున్నాం, యావత్ భారత్ నిన్ను నమ్ముతోంది. నువ్వు ఆఖరి వరకు క్రీజులో ఉంటే, కచ్చితంగా మ్యాచ్ గెలిపిస్తావు' అని. వారి మాటలే నా మదిలో మెదిలాయి. అందుకే ఆటను వీలైనంత ముందుకు తీసుకెళ్లాలనుకున్నాను" అని తిలక్ వివరించాడు.ఒక దశలో 10.5 ఓవర్లకు 70 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి భారత్ తీవ్ర కష్టాల్లో పడింది. ఆ సమయంలో క్రీజులోకి వచ్చిన తిలక్ వర్మ, ముందుగా నమన్ ధీర్ (17 బంతుల్లో 31)తో కలిసి ఆరో వికెట్‌కు 42 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. నమన్ ఔటైన తర్వాత, మరో తెలుగు ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి (13 బంతుల్లో 26 నాటౌట్) క్రీజులోకి వచ్చాడు. ఇద్దరు తెలుగు ఆటగాళ్లు కలిసి కివీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. ఓటమి ఖాయమనుకున్న దశ నుంచి అద్భుతమైన భాగస్వామ్యంతో జట్టును విజయతీరాలకు చేర్చారు. వీరిద్దరూ కలిసి అజేయంగా 69 పరుగులు జోడించి, మరో బంతి మిగిలి ఉండగానే భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యంలో నిలిచింది. మ్యాచ్ తర్వాత "నితీశ్ రెడ్డి, నేను.. కలిసి మ్యాచ్‌ను ముగించడం చాలా ఆనందంగా ఉంది" అని తిలక్ చెప్పడం విశేషం.

ముంబై ఇండియన్స్ అభిమానుల అంచనాలను అందుకోలేకపోయాం.. ముందు అది అంగీకరించాలి: పొలార్డ్



ఐపీఎల్‌లో ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ముంబై ఇండియన్స్ ఇటీవలి సీజన్లలో అభిమానుల అంచ నాలకు తగ్గట్టుగా ఆడలేకపోయిందని ఆ జట్టు కొత్త హెడ్ కోచ్ కీరన్ పొలార్డ్ అంగీకరించాడు. తిరిగి పాత వైభవాన్ని సాధించాలంటే ముందుగా తమ లోపాలను గుర్తించి అంగీకరించాలని అన్నాడు. జట్టులో మళ్లీ పోరాట స్ఫూర్తిని నింపి, ప్రత్యర్థులు భయపడేలా ముంబైని తీర్చిదిద్దుతామని చెప్పాడు.గత నాలుగు ఐపీఎల్ సీజన్లలో బ్యాటింగ్ కోచ్‌గా పనిచేసిన పొలార్డ్.. మహేల జయవర్ధనే స్థానంలో ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. 2010లో ఆటగాడిగా ముంబైతో అనుబంధం ప్రారంభించిన అతడు.. 2013, 2015, 2017, 2019, 2020లో ఐపీఎల్ టైటిళ్లు సాధించిన జట్లలో భాగమ య్యాడు."మనం అభిమానులు కోరుకున్నంత గొప్పగా ఆడలేకపోయామని అంగీకరించాలి. మెరుగుప డటానికి తొలి అడుగు అదే. అభిమానులు మాకు ఎప్పుడూ అండగా ఉన్నారు. కొత్త తరం క్రికెటర్లతో కలిసి మళ్లీ మధుర జ్ఞాపకాలు సృష్టించాలని కోరుకుం టున్నాం. ముంబై మరోసారి నిర్భయంగా ఆడే జట్టుగా మారాలి" అని పొలార్డ్ తెలిపాడు. 2020 తర్వాత ముంబై ఇండియన్స్ మరోసారి ఐపీఎల్ టైటిల్ గెలవలేదు. 2023, 2025లో ప్లేఆఫ్స్‌కు చేరినప్పటికీ.. 2024లో పదో స్థానం, 2026లో తొమ్మిదో స్థానంతో సరిపెట్టుకుంది. ఈ వైఫల్యాలను దాచిపెట్టబోమని పొలార్డ్ స్పష్టం చేశాడు. "వాంఖడే స్టేడియంలో ముంబై నీలి జెండా ఎగరాలి. అభిమా నుల ఉత్సాహం, జట్టు పట్ల అభిమానం ఆటగా ళ్లలోనూ కనిపించాలి. మనం ఎవరి కోసం, దేనికోసం ఆడుతున్నామో అర్థం చేసుకోవాలి. వ్యక్తిగత ప్రయో జనాల కంటే జట్టుకే ప్రాధాన్యం ఇస్తాం. ప్రత్యర్థులు ముంబైతో ఆడిన అనుభవాన్ని గతంలోలా గుర్తుంచు కునేలా చేయాలి. ముందుకు వెళ్లాలంటే కొన్నిసార్లు గతాన్ని గుర్తుచేసుకుని మన గుర్తింపును అర్థం చేసుకోవాలి" అని వివరిం చాడు.ప్రధాన కోచ్ బాధ్యతలు చేపట్టడం ఇంకా కొత్త అనుభూతిగానే ఉందన్న పొలార్డ్.. ఆటగాడిగా ఉన్నప్పటి గెలుపు కసి తగ్గదని చెప్పాడు. "ఎప్పుడూ గెలవాలనే తపన, జట్టులో ఉత్సాహాన్ని నింపాలనే పట్టుదల అలాగే ఉంటాయి. కాకపోతే ఇప్పుడు మైదానానికి కొంచెం దూరం నుంచి నా పాత్ర పోషించాలి" అని పేర్కొన్నాడు. తనకు ముందు కోచ్‌గా పనిచేసిన మహేల జయవర్ధనే నుంచి ఎంతో నేర్చుకున్నానని పొలార్డ్ తెలిపాడు. ప్రత్యర్థిగా మొదలైన పరిచయం, అతడి శిక్షణలో ఆటగాడిగా, తర్వాత సహాయకుడిగా పనిచేసే వరకు కొనసాగిందని గుర్తుచేసుకున్నాడు. వ్యూహరచన, ప్రణాళిక, ఆటగాళ్ల నుంచి అత్యుత్తమ ప్రదర్శన రాబట్టడంలో జయవర్ధనే విధానం తనకు ఎంతో ఉపయోగపడిందని చెప్పాడు.

స్పోర్ట్స్

భారత్‌కు విజయ 'తిలకం'.. రెండో టీ20లోనూ టీమిండియా అద్భుత విజయం



టీమిండియాకు ఓటమి తప్పదనుకున్న వేళ తెలుగు కుర్రాళ్లు అదరగొట్టారు. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డితో కలిసి భారత వైస్ కెప్టెన్ తిలక్ వర్మ అద్భుతం చేశాడు. చివరి ఓవర్లలో మెరుపు బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పి న్యూజిలాండ్‌పై టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. క్రైస్ట్‌చర్చ్‌లోని హాగ్లీ ఓవల్ వేదికగా శనివారం జరిగిన రెండో టీ20లో న్యూజిలాండ్ నిర్దేశించిన 181 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత జట్టు మధ్యలో తడబడినా.. తిలక్, నితీశ్ పోరాటంతో విజయాన్ని అందుకుంది. టాస్ గెలిచిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బౌలింగ్ ఎంచుకున్నాడు. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 180 పరుగులు చేసింది. ఆరంభంలో భారత బౌలర్లు పైచేయి సాధించారు. టిమ్ సీఫెర్ట్ (7), డారిల్ మిచెల్ (6), ఫిన్ అలెన్ (16) త్వరగా వెనుదిరిగారు. అర్ష్‌దీప్ సింగ్ రెండు వికెట్లు తీయగా.. ఫ్రిన్స్ యాదవ్, భువనేశ్వర్ కుమార్, నితీశ్ కుమార్ రెడ్డి చెరో వికెట్ పడగొట్టారు. అయితే గ్లెన్ ఫిలిప్స్, టెవాన్ జాకబ్స్ భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నారు. ఫిలిప్స్ 43 బంతుల్లో 70 పరుగులు చేయగా, జాకబ్స్ 46 బంతుల్లో 58 పరుగులతో రాణించాడు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 116 పరుగులు జోడించి న్యూజిలాండ్‌ను పటిష్ఠ స్థితికి చేర్చారు. చివర్లో మైకేల్ బ్రేస్‌వెల్ రెండు బంతుల్లోనే 10 పరుగులు చేయడంతో ఆతిథ్య జట్టు 180 పరుగుల స్కోరు సాధించింది. 181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. సంజూ శాంసన్ (14), వైభవ్ సూర్యవంశీ (4) త్వరగా ఔటయ్యారు. అభిషేక్ శర్మ (27), శ్రేయస్ అయ్యర్ (7) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. దీంతో భారత్ పరుగుల కోసం ఇబ్బంది పడింది.

'ధూమకేతు' (నెట్ ఫ్లిక్స్) మూవీ రివ్యూ!



మలయాళం నుంచి ఒక కామెడీ ఎంటర్టైనర్ ఇప్పుడు ఓటీటీ ద్వారా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. టైమ్ లూప్ కాన్సెప్ట్ తో నడిచే కామెడీ సినిమా ఇది. సజిన్ గోపు - నిఖిలా విమల్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమాకి సుధీ మాడిసన్ దర్శకత్వం వహించాడు. సెప్టెంబర్ 25వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, ఈ నెల 23వ తేదీ నుంచి 'నెట్ ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ అవుతోంది. కుట్టన్ (సజిన్ గోపు) తన పెళ్లి విషయంలో బెంగ పెట్టేసుకుంటాడు. తాను పెద్ద అందగాడిని కాననే నమ్మకం ఒక వైపు .. పెళ్లి వయసు దాటిపోయాననే ఆందోళన ఒక వైపు ఆయనను సతమతం చేస్తుంటాయి. అలాంటి పరిస్థితులలోనే ఆయనను పెళ్లి చేసుకోవడానికి షర్మిళ (నిఖిలా విమల్) ఒప్పుకుంటుంది. అంత అందమైన అమ్మాయి తనని పెళ్లి చేసుకోవడానికి ఒప్పుకోవడాన్ని అతని నమ్మలేకపోతాడు. ఆ విషయాన్ని జీర్ణించుకోవడానికి ఆయనకి చాలా సమయం పడుతుంది. పెళ్లి పనులు జరుగుతున్న సమయంలోనే, 'ధూమకేతు' అనే ఒక తోకచుక్క భూమికి దగ్గరగా దూసుకెళ్లనుందనే వార్త టీవీలలో హల్ చల్ చేస్తూ ఉంటుంది. ఆ ప్రభావం వలన అనేక మార్పులు జరిగే అవకాశం ఉందని నిపుణులు తమ అభిప్రాయాలను వెల్లడిస్తూ ఉంటారు. అలాంటి పరిస్థితులలోనే షర్మిళతో కుట్టన్ పెళ్లి జరిగిపోతుంది. వాళ్ల శోభనానికి ఏర్పాట్లు చేస్తారు. అయితే శోభనం రోజు రాత్రి మాస్క్ ధరించిన దుండగులు తనపై దాడి చేసి, శోభనాన్ని అడ్డుకున్నట్టుగా అతనికి అనిపిస్తుంది. నిద్రలేచిన తరువాత .. అప్పటివరకూ ఏవైతే సంఘటనలు తన అనుభవంలోకి వచ్చాయో, మళ్లీ అవే సంఘటనలు అలాగే జరుగుతూ ఉంటాయి. శోభనం గదిలోకి అడుగుపెట్టిన ప్రతిసారి తనపై దాడి జరగడం, నిద్రలేచిన తరువాత .. అవే సంఘటనలు జరగడం అతనికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. శోభనం రాత్రి తనపై దాడి జరగడం .. మళ్లీ అదేరోజు ఉదయానికి తాను చేరుకోవడం ఒక టైమ్ లూప్ లో జరుగుతుందనే విషయం కుట్టన్ కి అర్థమవుతుంది. దాంతో జయగుతున్న సంఘటనలను తనకి అనుకూలంగా మార్చాలని నిర్ణయించుకుంటాడు. అయితే తనపై దాడి చేస్తున్న మాస్క్ మనుషులు ఎవరై ఉంటారనేది అతను కనుక్కోలేకపోతాడు. వాళ్లు కొమ్మాడి కరియా మనుషులు అయ్యుంటారనే అనుమానాన్ని అతను షర్మిళ దగ్గర వ్యక్తం చేస్తాడు. శేఖరన్ కుట్టి మనుషులు కూడా కావొచ్చనే సందేహాన్ని షర్మిళ వ్యక్తం చేస్తుంది. ఆ గ్యాంగ్ లీడర్లు ఎవరు? ఈ జంటతో వాళ్లకి గల సంబంధం ఏమిటి? ఈ సమస్య నుంచి ఈ జంట ఎలా బయటపడుతుంది? అనేది మిగతా కథ. టైమ్ లూప్ కాన్సెప్ట్ తో గతంలోను కొన్ని సినిమాలు వచ్చాయి. ఇక ఈ మధ్య కాలంలో ఈ తరహా కాన్సెప్ట్ తో వస్తున్న సిరీస్ లు .. సినిమాల సంఖ్య పెరుగుతోంది. ఒక ప్రదేశానికి సంబంధించిన .. ఒక సంఘటనకి సంబంధించిన టైమ్ లూప్ కథలు ప్రేక్షకులను అలరిస్తూ వెళుతున్నాయి. అలాంటి ఒక కథతో రూపొందిన సినిమాగా 'ధూమకేతు' కనిపిస్తుంది. తోకచుక్కతో ముడిపడి ఉండటం ఈ సినిమా ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. ఒకరోజుకి సంబంధించిన టైమ్ లూప్ లో చిక్కుకున్న హీరో .. అతని శోభనం చుట్టూ అల్లుకున్న కథ ఇది. పెళ్లికి సంబంధించిన పనులు .. బంధువుల సమక్షంలో పెళ్లి .. భోజనాలు .. శోభనం .. అనే అంశాలను కలుపుకుంటూ ఈ కథ పరిగెడుతుంది. హీరోకి మాత్రమే ఎందుకు ఇలా జరుగుతోంది? అతనిపై దాడి చేస్తున్న మాస్క్ మనుషులు ఎవరు? అనేది ఆడియన్స్ లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. తాను చెప్పదలచుకున్న విషయాన్ని కామెడీ టచ్ తో చెప్పాలని దర్శకుడు భావించాడు. ఆ దిశగానే అతను ఈ కథను ముందుకు తీసుకెళ్లాడు. అయితే టైమ్ లూప్ కథలలో ఒకే సన్నివేశం చిన్న చిన్న మార్పులతో మళ్లీ మళ్లీ తెరపైకి వస్తుంటుంది. అందువలన చూస్తున్న సన్నివేశాలని పదే పదే చూడవలసి రావడం ఆడియన్స్ కి కాస్త అసహనాన్ని కలిగిస్తుంది. ఈ సినిమా విషయంలోను అదే జరుగుతుంది.

ఎయిర్‌పోర్ట్‌లో చుట్టుముట్టి తాకారు నటి అనుపమ పరమేశ్వరన్ ఆవేదన



ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ తనకు ఎయిర్‌పోర్ట్‌లో ఎదురైన ఓ చేదు అనుభవాన్ని తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పంచుకున్నారు. కొందరు వ్యక్తులు తనను చుట్టుముట్టి, అనుమతి లేకుండా ఫొటోలు తీయడమే కాకుండా అసభ్యంగా తాకారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను మానసికంగా ఎంతో ఇబ్బంది పెట్టిందని తెలిపారు. వివరాల్లోకి వెళ్తే, ఇటీవల ఓ ఎయిర్‌పోర్ట్‌లో లగేజీ కోసం ఒంటరిగా వేచి చూస్తున్న సమయంలో కొందరు తన వద్దకు వచ్చారని అనుపమ చెప్పారు. మొదట మాట్లాడేందుకు ప్రయత్నించి, ఆ తర్వాత తన అనుమతి లేకుండానే ఫొటోలు తీయడం మొదలుపెట్టారని వివరించారు. క్షణాల్లో జనం తనను చుట్టుముట్టారని, ఫొటోలు తీస్తూ తనను తాకారని, ఆ సమయంలో ఏం చేయాలో పాలుపోలేదని ఆమె పేర్కొన్నారు. అభిమానులతో ఫొటోలు దిగడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని అనుపమ స్పష్టం చేశారు. అయితే, కొందరు ప్రవర్తించే తీరు, హద్దులు మీరడం ఆందోళన కలిగిస్తుందన్నారు. ఇలాంటి సమయాల్లో ఎవరు ఎలా ప్రవర్తిస్తారో, ఎక్కడ తాకుతారో తెలియక భయమేస్తుందని ఆమె అన్నారు. నటీనటుల వృత్తి జీవితంలో అభిమానులతో ఫొటోలు దిగడం సాధారణమే అయినా, కచ్చితంగా కొన్ని హద్దులు పాటించాలని సూచించారు. సమాజంలో సాధారణ మహిళలు కూడా ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి ధైర్యాన్ని మెచ్చుకోవాలని అనుపమ పేర్కొన్నారు.

కాల్పుల ఘటన తర్వాత.. రూ. 9 కోట్లకు ముంబై ఫ్లాట్‌ను అమ్మేసిన టైగర్ ష్రాఫ్

బాలీవుడ్ యాక్షన్ హీరో టైగర్ ష్రాఫ్ తన కారుపై కాల్పులు జరిగిన కొద్ది రోజులకే కీలక నిర్ణయం తీసుకున్నారు. ముంబైలోని తన విలాసవంతమైన అపార్ట్‌మెంట్‌ను ఆయన రూ. 9 కోట్లకు విక్రయించారు. అక్టోబర్ 18న కాల్పుల ఘటన చోటుచేసుకోగా, సరిగ్గా నాలుగు రోజుల తర్వాత అక్టోబర్ 22న ఈ ఆస్తికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కావడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.రియల్ ఎస్టేట్ అనలిటిక్స్ సంస్థ 'సీఆర్ఈ మ్యాట్రిక్స్' ప్రకారం, ముంబైలోని ఖార్ వెస్ట్ ప్రాంతంలో గల 'రుస్తోమ్జీ పారామౌంట్ డీ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ'లో ఈ ఫ్లాట్ ఉంది. తొమ్మిదో అంతస్తులో ఉన్న ఈ అపార్ట్‌మెంట్ కార్పెట్ ఏరియా 1,291.14 చదరపు అడుగులు కాగా, 95.80 చదరపు అడుగుల ప్రత్యేక ఏరియా కూడా ఉంది. దీనితో పాటు రెండు కార్ పార్కింగ్ స్లాట్లు ఉన్నాయి. ఈ విక్రయానికి సంబంధించి రూ. 54 లక్షల స్టాంప్ డ్యూటీ చెల్లించినట్లు సమాచారం. దీని ప్రకారం చదరపు అడుగు ధర సుమారు రూ. 64,891 పలికినట్లు తెలుస్తోంది.టైగర్ ష్రాఫ్ ఈ ఆస్తిని 2018 జూలై 17న డెవలపర్ కీస్టోన్ రియల్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి రూ. 7.61 కోట్లకు కొనుగోలు చేశారు. అనంతరం 2019 నవంబర్ 30న ఈ ఫ్లాట్‌ను ఆయన స్వాధీనం చేసుకున్నారు.అక్టోబర్ 18న సాయంత్రం జుహు ప్రాంతంలో టైగర్ ష్రాఫ్ కారుపై కొందరు దుండగులు కాల్పులకు తెగబడిన విషయం తెలిసిందే. బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు జరిపిన ఈ దాడిలో టైగర్ ష్రాఫ్‌కు స్వల్ప గాయాలవగా, ఆయన డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై ప్రస్తుతం పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. భద్రతాపరమైన ఆందోళనలు నెలకొన్న తరుణంలో ఆయన ఈ ఆస్తిని విక్రయించడం ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా, గత ఏడాది కాలంలో టైగర్ ష్రాఫ్ తన ఆస్తులను విక్రయించడం ఇది మూడోసారి కావడం గమనార్హం.



PRINTED ,PUBLISHED ,OWNED BY TEHELKA MEDIA NETWORK ,DIGITAL NEWS .Regd no:2019/28814, EDITOR :K.CHANDRA SHEKHAR, EXECUTIVE EDITOR :K.SRINIVAS RAO, G6 MES Colony, Alwal , Secunderabad -500010.e-mail:Tehelkamedianetworks@gmail.com